

ఏలూరు **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 30.0
కనిష్ఠం : 20.0

కలిసొచ్చిన కడప బంధుత్వం!



అందరూ ఊహించినట్టుగానే వైసీపీ మూడో జాబితాలో ఏలూరు పార్లమెంటు స్థానానికి ఇన్‌చార్జిగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తనయుడు సునీల్‌కుమార్‌కు అవకాశం ఇచ్చింది. ఆయనకు కడప బంధుత్వం కలిసి వచ్చింది. చింతలపూడి ఇన్‌చార్జిగా మండలి చైర్మన్ మోషేన్‌రాజు వియ్యంకుడు, బ్రేక్ ఇన్‌స్పెక్టర్ కె.విజయరాజును నియమించింది. ఒక్క నరసాపురం పార్లమెంటు మినహా మిగతా అసెంబ్లీ నియోజకవర్గాల్లో పెద్దగా మార్పులు, చేర్పులు ఉండబోవని సరికొత్త సంకేతాలు ఇచ్చేశారు.




- ఏలూరు లోక్‌సభ ఇన్‌చార్జిగా సునీల్‌కుమార్
- మంత్రి కారుమూరి తనయుడికే అవకాశం
- చింతలపూడి ఇన్‌చార్జ్‌గా విజయరాజుకు ఛాన్స్
- వైసీపీ మూడో జాబితాలో అనూహ్య పరిణామాలు
- మిగతా స్థానాల్లో సిట్టింగులంతా ఇప్పటికి సేఫ్ !
- నూజివీడు టీడీపీ నుంచి పార్థసారథికి లైన్ క్లియర్ !

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

ఏలూరు లోక్‌సభ స్థానం నుంచి తాను పోటీ చేసేది లేదని సిట్టింగ్ ఎంపీ కోటగిరి శ్రీధర్ అధిష్టానానికి స్పష్టం చేశారు. ఇక ఆయన స్థానంలో బీసీ అభ్యర్థిని రంగంలోకి దింపాలని భావించిన పార్టీ ఆ దిశగా కసరత్తు చేసింది. జోగి రమేష్ పేరు ప్రముఖంగా ప్రస్తావనకు వచ్చింది. ఆయనను పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించారు. ఏలూరు నుంచి యాదవులకు అవకాశం ఇవ్వాలని, ఈ సామాజిక వర్గానికి చెందిన మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పేరును తొలుత ప్రతిపాదించారు. ఏలూరు పార్లమెంటు నియోజకవర్గంలో వున్న యాదవుల ఓట్లతోపాటు పార్టీకి అనుకూలంగా వున్న ఓట్ల వివరాల తీసివేతలు, కూడికలు తర్వాత సర్వే చేశారు. బీసీ మంత్రం పటిస్తున్నారు కాబట్టి నాగేశ్వరరావు వైపే మొగ్గు చూపారు. కాని దీనికి కారుమూరి నిరాకరిస్తూనే తన కుమారుడు సునీల్‌కు తణుకు సీటు ఇవ్వాలని అధిష్టానాన్ని అభ్యర్థించారు. పార్టీలో తన రాజకీయ గురువుల ద్వారా జగన్ చెవిన వేశారు. దీంతో ఇక కొత్త ముఖం తప్పనిసరి అని అందరూ భావిస్తుండగా కారుమూరి తనయుడు సునీల్ కుమార్‌ను ఏలూరు పార్లమెంటు నియోజకవర్గ స్థానానికి ఇన్‌చార్జిగా నియమిస్తూ తద్వారా వచ్చే ఎన్నికల్లో ఆయనే అభ్యర్థిగా వైసీపీ చెప్పకనే చెప్పింది. ఎంపీ స్థానానికి పోటీ చేసేందుకు ఎవరూ అనుకూలత చూపించకపోవడం, పార్టీ ఆశిస్తున్నట్టు ఎన్నికల పెట్టుబడి లెక్కలపై వెనుకంజ వేశారు. చివరకు సునీల్ వైపు మొగ్గు చూపారు. ఆయనకు 'కడప బంధుత్వం' కలిసి వచ్చినట్లు చెబుతున్నారు. మామ బిల్డర్ కావడం, తన భార్య వైపు బంధువుల సాన్నిహిత్యం కలిసి ఉండడం ఆయనకు కలిసి వచ్చింది. అనూహ్య పరిణామాల మధ్య సునీల్ అభ్యర్థిత్వానికి కొంత రిబేటు కూడా కలిసి వచ్చినట్లు చెబుతున్నారు.



చింతలపూడికి విజయరాజు



చింతలపూడి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తనకు మరోసారి ఛాన్స్ ఇవ్వాలంటూ పదే పదే పార్టీ అధినాయకత్వాన్ని ఒప్పించేందుకు చేసిన ప్రయత్నాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే ఎలీజా విఫలమయ్యారు. దీంతో ఆయన స్థానంలో రవాణ శాఖ మాజీ ఉద్యోగి కె.విజయరాజును ఇన్‌చార్జిగా నియమించారు. పక్షం రోజుల ముందే విజయరాజు పట్ల సానుకూలంగా సంకేతాలు ఇచ్చినా ఒకటి, రెండు అంశాల విషయంలో పదేపదే నియోజకవర్గాల నుంచి వివరాలు రాబడుతూ వచ్చారు. తుదకు అందరూ ఊహించినట్టుగానే విజయరాజు నియామకానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారు. కామవరపుకోట మండలానికి చెందిన విజయరాజు అన్ని పార్టీల నేతలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఇది కూడా ఆయన ఇన్‌చార్జిగా నియామకానికి ప్లస్ మార్కుగా నిలిచింది. మరోవైపు తన వియ్యంకుడు శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు కావడం కూడా కలిసి వచ్చినట్లు చెబుతున్నారు. ఈ నియామకం తర్వాత ఎమ్మెల్యే ఎలీజా అందుబాటులో రాలేదు.

పార్థసారథికే నూజివీడు టీడీపీ టిక్కెట్

మచిలీపట్నం లోక్‌సభకు పోటీ చేయాలని సీఎం జగన్ పదే పదే చెప్పినా పెనమలూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొలుసు పార్థసారథి అంగీకరించడం లేదు. పెనమలూరు మినహా మరెక్కడా పోటీ చేయనని సోమవారం ముఖ్యమంత్రికే చెప్పి వచ్చారు. మంగళవారం పార్థసారథితో ఎంపీ అయోధ్యరామిరెడ్డి సుదీర్ఘంగా మంతనాలు జరిపినా ప్రయోజనం లేకపోయింది. దీంతో ఆయన టీడీపీ తరఫున నూజివీడు బరిలో నిలిపేందుకు లైన్ క్లియర్ అయినట్లు సమాచారం. తెలుగుదేశం ముఖ్యనేతలు పార్థసారథితో ఇప్పటికే మంతనాలు జరిపారు. దాదాపు ఒక కొలిక్కి వచ్చింది. దీనిపై ఒకటి రెండు రోజుల్లో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

ఇక మార్పులు ఉండకపోవచ్చు !

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు మినహా మిగతా నియోజకవర్గాలన్నింటిపైనా వైసీపీ క్లారిటీగా ఉందని, ఇకపై పెద్దగా మార్పులు, చేర్పులు ఉండబోవని ఆ పార్టీ నేతలు కొందరు అంచనా వేస్తున్నారు. అయితే అప్పటికప్పుడు అనూహ్య నిర్ణయాలు తీసుకోవడంలో వైసీపీ పెట్టింది పేరని, ప్రస్తుతానికి తామంతా సేఫ్ పొజిషన్‌లోనే ఉన్నామని వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యేలు భావిస్తున్నారు. ఇన్‌చార్జిలుగా ప్రస్తుతం నియామకమైన వారి విషయంలోను తుది వరకు అనూహ్య సంఘటనలు ఏమీ లేకపోతే యధావిధిగానే వారు ఎన్నికలకు సిద్ధమవుతారని ఇంకొందరు భావిస్తున్నారు.

29న చంద్రబాబు 'రా కదలిరా' సభ



భీమడోలులో సభా వేదిక స్థలాన్ని పరిశీలిస్తున్న గన్ని వీరాంజనేయులు, టీడీపీ నాయకులు

భీమడోలు, జనవరి 11 : తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు ఈ నెల 29న ఏలూరు జిల్లా ఉంగుటూరు నియోజకవర్గం భీమడోలు రానున్నారు. 'రా కదలిరా' బహిరంగ సభకు హాజరుకానున్నారు. గురువారం సభా ప్రాంగణాన్ని ఏలూరు టీడీపీ టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు పరిశీలించారు. సభ నిర్వహణ కోసం భీమడోలు హైస్కూలు ఎదురుగా జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఖాళీ స్థలాన్ని, హెలీప్యాడ్ కోసం శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాల ప్రాంగణాన్ని పరిశీలించారు. గన్నితో పాటు రాజానగరం మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్, స్థానిక టీడీపీ నాయకులు పరిశీలించారు. అంతకు ముందు భీమడోలు క్యాంపు కార్యాలయంలో ముఖ్య నేతలతో గన్ని సమావేశం నిర్వహించారు. వైసీపీ పాలనలో అన్యాయాలను,అక్రమాలను ఎత్తి చూపేందుకు రా..కదలిరా నిర్వహిస్తున్నారన్నారు.

బదిలీల గుబులు

- ఇప్పటికే 33 మంది సీఐలు బదిలీ
- నేడే రేపో ఎస్‌ఐల బదిలీలకు రంగం సిద్ధం

ఏలూరు క్రైం, జనవరి 11 : సార్వత్రిక ఎన్నికలు మరో రెండు నెలల్లో జరగనున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అంతా చకచకా తమ పనులను కానిచ్చేస్తోంది. నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడానికి, ఏ అధికారికి ఎలాంటి ఒత్తిళ్లకు తావులేకుండా విధులను నిర్వర్తించడానికి ఏకంగా అధికారులను జిల్లాలే మార్చేయడానికి కేంద్ర ఎన్నికల సంఘం పక్కా ప్రణాళిక సిద్ధం చేసి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. కలెక్టర్, ఎస్పీ స్థాయి నుంచి ఎస్ఐ స్థాయి అధికారి వరకూ ఈ ఉత్తర్వులు అమలు చేయాలని ఆదేశాలు ఇవ్వడంతో తమ పరిస్థితి ఏమిటని ఏ జిల్లాకు వెళ్తామో అన్న ఆలోచనలో ఉద్యోగులు పడ్డారు. పోలీస్ శాఖలో దీనిపై మరింత తీవ్ర చర్చ సాగుతోంది. ఎందుకంటే ప్రజా ప్రతినిధుల సిఫార్సులతోనే చాలామంది తమ పోస్టులను దక్కించుకుని కొనసాగుతున్నారు. ఇప్పుడు ఎన్నికల సమయంలో జిల్లా దాటి మరో జిల్లాకు వెళ్లిపోవాల్సిందేనని ఎన్నికల కమీషన్ హుక్కుం జారీ చేయడంతో కొంతమంది అయోమయంలో పడ్డారు. ఎన్నికల కోడ్ పూర్తయ్యే వరకు మాత్రమే ఈ బదిలీలు అని ఆ ఉత్తర్వుల్లో లేకపోవడంతో డీలాపడ్డారు. ఇప్పుడు బదిలీ చేస్తే మరో మూడేళ్లు అక్కడే ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉండడంతో ఏమి చేయాలా అని ఆలోచనలో పడ్డారు. కలెక్టర్ నుంచి ఎస్ఐ స్థాయి వరకూ అధికారులు సొంత జిల్లాలో ఎట్టి పరిస్థితిలో పనిచేయకూడదని 2024 జూన్ 30 లోపు ఆ జిల్లాలో మూడేళ్లు సర్వీసు పూర్తయితే వారిని వేరే జిల్లాకు బదిలీ చేయాలని స్పష్టంగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం 26 జిల్లాలు ఉన్నాయి. కానీ పూర్వం ఉన్న 13 జిల్లాలనే పరిగణలోకి తీసుకుని ఈ బదిలీలు కొనసాగించాలనడంతో మూలిగేనక్కపై తాటికాయ పడ్డట్లుగా కొంతమంది అధికారుల పరిస్థితి ఉంది. పోలీస్ శాఖలో ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారుల బదిలీలు ఈనెల 8వ తేదీ చేపట్టారు. ఏలూరు రేంజ్ పరిధిలో 33 మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేశారు. ఇంకా కొంతమంది సీఐలు బదిలీ కావాల్సి ఉంది. ఇక ఎస్ఐల వంతు మిగిలింది. కేంద్ర ఎన్నికల సంఘం ఈనెల 9, 10 తేదీల్లో విజయవాడలో కలెక్టర్, ఎస్పీలతో సమావేశం నిర్వహించి ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాలపై కలెక్టర్, ఎస్పీలు ఏ చర్యలు తీసుకున్నారో వంటి వివరాలు తెలుసుకున్నారు. నేడో రేపో జిల్లాలో 13 మంది ఎస్ఐలకు బదిలీలు జరుగుతాయని సమాచారం. గతంలో లా అండ్ ఆర్డర్‌తో సంబంధం ఉన్నవారిని ఈ బదిలీల ప్రక్రియలో తీసుకున్నారు. ఇప్పుడు అలాంటివి ఏమి లేకుండా అధికారి ర్యాంక్‌ను మాత్రమే చూపించారు. దీంతో లూపులైన్లో పనిచేసే పోలీసు అధికారులు సైతం వేరే జిల్లాకు బదిలీ కావాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

పందేల బరుల ధ్వంసం



ముదినేపల్లి, జనవరి 11 : కోడిపందేల బరులను ధ్వంసం చేసేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. పందేల నిర్వహణకు చదును చేసిన పొలాలను ట్రాక్టర్లతో తిరిగి దున్నించారు. 'కోడీ' అనే శీర్షికన కైకలూరు నియోజకవర్గంలో పందేలకు బరులు సిద్ధం చేస్తున్నట్టు గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై స్పందించిన కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్, ఎస్పీ మేరీ ప్రశాంతి పందేల నిర్వహణ ఏర్పాట్లను తక్షణం అడ్డుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. తహసీల్దార్ శ్రీనివాస్, కైకలూరు రూరల్ సీఐ కృష్ణ కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ డి.వెంకట్ కుమార్, పోలీసు సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది అల్లూరులో పందేల బరికి చదును చేసిన పొలాన్ని ట్రాక్టర్లతో దున్నించేశారు. మండలంలోని మరికొందరికి నోటీసులు జారీ చేశారు.

సంక్రాంతి సంబరం



రాష్ట్ర సాహిత్య అకాడమి, వైఎంహెచ్ఏ, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఏలూరు వైఎంహెచ్ఏ ప్రాంగణంలో సంక్రాంతి సంబరాలను గురువారం నిర్వహించారు. భోగి మంటను వేసి కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్, జేసీ లావణ్య వేణి, రాష్ట్ర సాహిత్య అకాడమి చైర్మన్ శ్రీలక్ష్మి, జడ్పీ చైర్మన్ పద్మశ్రీ వేడుకలను ప్రారంభించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

అంబేడ్కర్ జీవితాన్ని భావితరాలకు తెలపాలి

- కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్



సమావేశంలో ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, జేసీ తదితరులు

ఏలూరు కలెక్టరేట్, జనవరి 11 : ప్రపంచ దేశా లకు ఆదర్శంగా నిలిచిన భారత రాజ్యాంగం రచిం చిన డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ జీవితాన్ని భావితరాలకు తెలపాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ అన్నారు. విజయవాడలో ఈనెల 19న అంబేడ్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహం ఆవిష్కరణ, స్మృతివనం ప్రారంభిస్తున్న సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో సమతా సంక ల్పం కార్యక్రమాన్ని కలెక్టర్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి కలెక్టర్‌తో పాటు జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, ఎస్పీ డి.మేరీప్రశాంతి, జేసీ లావణ్యవేణి, ఇతర జిల్లా అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ జీవితచరిత్రపై ఏర్పాటు చేసిన ఛాయచిత్ర ప్రదర్శనను కలెక్టర్ ప్రారంభించారు. అంబేడ్కర్ జీవిత చరిత్రకు సంబంధించి పుస్తకాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, సాంఘికసంక్షేమ శాఖ జేడీ సూర్యప్రకాశరావు, డీఈవో శ్యామ్‌సుందర్, డీపీవో తూతిక విశ్వనాథ్ పాల్గొన్నారు. గండికోట రాజేశ్ శిష్యబృందం ప్రదర్శించిన నృత్యం, పాఠశాల విద్యార్థినుల కోలాటం ఆకట్టుకున్నాయి.

జగనన్నతోడు నిధులు జమ

ఏలూరు కలెక్టరేట్, జనవరి 11 : జగనన్నతోడు పథకం 8వ విడత కింద గురువారం జిల్లాలో 16,289 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున రూ.17.23 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేసినట్టు కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ తెలిపారు. చిరు వ్యాపారులకు వడ్డీలేని రుణాలు, వడ్డీ రీయింబర్స్‌మెంట్ నమూనా చెక్కులను అందజేశారు. జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.

అమరావతి ఎక్స్‌ప్రెస్‌కు.. పచ్చజెండా



నరసాపురం, జనవరి 11: ఎట్టకేలకు అమరావతి ఎక్స్‌ప్రెస్‌కు పచ్చజెండా ఊపనున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి గుంటూరు నుంచి రిమోట్ కంట్రోల్ ద్వారా ఈ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభిస్తున్నారు. నరసాపురంలో మంత్రులు కొట్టు సత్యనారాయణ, కారుమూరి నాగేశ్వరరావు, దాడిశెట్టి రాజా, చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, ఎంపీ రఘురామ కృష్ణంరాజు, శాసన మండలి చైర్మన్ మోషేన్‌రాజు, ఎమ్మెల్సీలు కవురు శ్రీను, ఐవీ, వంకా రవీంద్రలు పాల్గొనున్నారు. విజయవాడ రైల్వే డీఆర్ఎంతో పాటు ఏడీఆర్ఎంలు హాజరవుతున్నారు. చాలా ఏళ్లుగా ఈ ఎక్స్‌ప్రెస్ విజయ వాడ నుంచి నడుస్తోంది. నరసాపురం-విజయవాడల మధ్య డబ్లింగ్ లైన్ పూర్తికావడంతో గతేడాది నవంబరులో ఈ ఎక్స్‌ప్రెస్‌ను నరసాపురం వరకు పొడిగించారు. ఈ ఏడాది జనవరిలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు ప్రయత్నించారు. అయితే మంత్రి బిజీగా ఉండడంతో ఏడాదిగా ఈ రైలుకు మోక్షం కలగలేదు. విజయవాడ నుంచి నడుస్తోంది. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై రైల్వే అధికారులు, జిల్లా బీజేపీ నాయకులు స్పందించి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో శుక్రవారం కిషన్‌రెడ్డి గుంటూరులో రిమోట్ కంట్రోల్ ద్వారా రైలును ప్రారంభించనున్నారు.

గోవా వెళ్లేవారికి..

గోవా వెళ్లే ప్రయాణికులు నేరుగా ఈ ఎక్స్‌ప్రెస్‌లో వెళ్లవచ్చు. కొన్ని బోగీలు హుబ్లీలో వేరు చేసి హైదరాబాద్ నుంచి వచ్చే ఎక్స్‌ప్రెస్‌కు జత చేస్తారు. తిరుగు ప్రయాణంలోనూ గోవాలో హైదరాబాద్ వెళ్లే ఎక్స్‌ప్రెస్‌కు జత చేసి హుబ్లీలో వాటిని అమరావతి ఎక్స్‌ప్రెస్‌కు కలుపుతారు. జిల్లా నుంచి కర్ణాటక, రాయలసీమ వెళ్లే ప్రయాణికులకు ఈ రైలు సౌకర్యవంతంగా ఉంటుంది.

షెడ్యూల్ ఇలా..

ఈ రైలు 17225 నంబరుతో మధ్యాహ్నం 3 గంటలకు నరసాపురంలో బయల్దేరి విజయవాడ, గుంటూరు, మార్కాపురం, నంద్యాల, గుంతకల్, బళ్లారి, హోస్పేట్ మీదుగా మరుసటి రోజు ఉదయం 11.20కి హుబ్లీ చేరుకుంటుంది. తిరిగి 1.20లకు 17226 నంబరుతో హుబ్లీలో బయలుదేరి మరుసటి ఉదయం 7 గంటలకు నరసాపురం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో విజయ వాడకు 5.15 గంటలకు వస్తుంది. జిల్లాలో పాల కొల్లు, భీమవరం టౌన్, జంక్షన్, ఆకువీడు, కైకలూరు స్టేషన్లలో ఆగనుంది.

2600 మంది అంగన్‌వాడీలకు.. షోకాజ్ నోటీసులు



ఎర్రగుంటపల్లిలో అంగన్‌వాడీ సెంటర్ తలుపునకు నోటీసు అంటిస్తున్న వీఆర్వో

ఏలూరు రూరల్/చింతలపూడి/పెదవేగి, జనవరి 11 : జిల్లావ్యాప్తంగా రెండోరోజు స్త్రీశిశు సంక్షేమ శాఖ అంగన్‌వాడీలకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈనెల 9వ తేదీ లోపు విధుల్లో చేరాలని డెడ్‌లైన్‌ను ప్రభుత్వం విధించినా ఈ ఉత్తర్వులను ధిక్కరించినా జిల్లాలోని 2600 మంది అంగన్‌వాడీలకు ఈ నోటీసులు జారీ చేసింది. సమ్మెపై ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించినా వారు వెనక్కి తగ్గకపోవడంతో షోకాజ్ నోటీసులు పర్వానికి ప్రభుత్వం తెరలేపింది. ఉద్యోగంలో నుంచి తొలగిస్తామంటూ హెచ్చరిస్తోంది. జిల్లాలో 2 వేలకు పైగా అంగన్‌వాడీ సెంటర్లు ఉండగా, వీటిలో 2300 అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, ఆయాలు ఉన్నాయి. గత నవంబరు 20వ తేదీ నుంచి ప్రభుత్వానికి సమ్మె నోటీసులు ఇచ్చిన అంగన్‌వాడీలు డిసెంబరు 12వ తేదీ నుంచి సెంటర్లు మూసివేసి సమ్మెలోకి వెళ్లారు. దీంతో ప్రభుత్వం సెంటర్ల తాళాలు పగులకొట్టి వాటి పర్యవేక్షణ, పౌష్టికాహారం పంపిణీ బాధ్యతలను ఎంఎస్‌కేలు, వెలుగు గ్రూప్ సభ్యులకు అప్పగించింది. కాని సెంటర్లకు చిన్నారులను రప్పించలేకపోయింది. దీంతో కేవలం అత్యవసర ప్రభుత్వ సర్వీస్ ఉద్యోగులు సమ్మె చేస్తే ప్రయోగించాల్సిన ఎస్మా చట్టాన్ని ప్రత్యేక జీవో-2ను తీసుకొచ్చి అంగన్‌వాడీలపై ప్రయోగించింది. అయినా బెదరకుండా సమ్మెను కొనసాగిస్తున్నారు. దీంతో ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి ఉద్యోగం నుంచి ఎందుకు తొలగించకూడదో కారణం తెలపాలని షోకాజ్ నోటీసులు జారీ చేసింది. పదిరోజుల్లోగా సమాధానం చెప్పాలని, లేకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. కాగా ప్రభుత్వం సమ్మెపై ఈనెల 13వ తేదీ సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ అసోసియేషన్ నాయకులతో చర్చించనున్నట్టు సమాచారం.

- చింతలపూడి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని 381 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, మినీ కార్యకర్తలు, హెల్పర్లకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్టు ఐసీడీఎస్ పీవో మాధవి తెలిపారు. లేదంటే తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రాజెక్టు పరిధిలో చింతలపూడి, టి.నరసాపురం, లింగపాలెం మండలాల్లో 177 అంగన్‌వాడీ సెంటర్లు, 30 మినీ సెంటర్లు, హెల్పర్లు కలిపి 381 మంది పనిచేస్తున్నారని, వీరందరికీ రిజిస్టర్ పోస్టు ద్వారా అంగన్‌వాడీ సెంటర్లు, ఇళ్ల వద్ద, లేదా ఇంటి గోడపై నోటీసులు వీఆర్వోల ద్వారా అంటించినట్టు తెలిపారు. పెదపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 241 సెంటర్లు ఉండగా 238 మది అంగన్‌వాడీ కార్యకర్తలకు, 204 మంది సహాయకు లకు నోటీసులు అందించినట్టు సీడీపీవో కె.విజయలక్ష్మి తెలిపారు.



అంగన్‌వాడీలను ఉద్దేశించి మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ఏలూరు కలెక్టరేట్, జనవరి 11: 'అంగన్‌వాడీల నిరవధిక సమ్మె రాజకీయ పోరాటంగా మారకముందే ప్రభుత్వం మేల్కొని సమస్యలు పరిష్కరించాలి. లేకుంటే పండుగ అనంతరం ఉద్యమం రాజకీయరూపం తీసుకుంటుంది' అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కలెక్టరేట్ వద్ద జరుగుతున్న 31వ రోజు సమ్మెకు, 6వ రోజు 24 గంటల దీక్షలకు సంఘీభావంగా గురువారం ఆయన పాల్గొని ప్రసంగించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లింగరాజు అధ్యక్షత వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ అంగన్‌వాడీల ఓర్పు, సహనానికి పరీక్ష పెట్టొద్దని వారి ఆగ్రహంతో కొట్టుకుపోవద్దని హితవు పలికారు. సీపీఎం కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, డీఎన్‌వీడీ ప్రసాద్, కె.విజయలక్ష్మి, వి.సాయిబాబు, హైమావతి, రజినీ, బేబిరాణి, శాంతి, పుష్పరాజ్యం, జయసుధ,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కలర్‌ఫుల్ : రంగులమయమైన నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని టెన్నిస్ కోర్టు



హరివిల్లు.. సిరిజల్లు..

వైభవంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

"ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్‌బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు, రియల్ పార్టనర్స్ స్వర్గసీమ సుకేతన" ఫైనల్స్ గురువారం విజయవాడలో అంగ'రంగుల' వైభవంగా జరిగాయి. బెంజిసర్కిల్ సమీపంలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీ టెన్నిస్ కోర్టులో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 జిల్లాల స్థాయిలో విజేతలుగా నిలిచిన మహిళలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కూడా పాల్గొన్నారు. తమ సృజనతో ముత్యాల ముగ్గుల్లో రంగుల దృశ్యాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన బహుమతుల ప్రదానోత్సవానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కెనరా బ్యాంక్ విజయవాడ సర్కిల్ ఏజీఎం జీవీ నరసింహారావు, కెనరా బ్యాంక్ మార్కెటింగ్ సర్కిల్ సీనియర్ మేనేజర్ శిరీష, 'ఆంధ్రజ్యోతి' న్యూస్ ఎడిటర్ నాగసుధాకర్, 'ఆంధ్రజ్యోతి' విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ, ఏబీఎన్ ఏపీ బ్యూరో బి.రామారావు, యాడ్స్ ఏజీఎం టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, మల్లెల శుభప్రద వ్యవహరించారు. **- ఆంధ్రజ్యోతి, విజయవాడ**

ప్రథమ బహుమతి గెలుచుకున్న విజయనగరం జిల్లా మహిళ

గుంటూరు, అనంతపురం, తమిళనాడు మహిళలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



పరిశీలన : ముగ్గులను పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

ద్వితీయ బహుమతి విజేతలు

ఐదేళ్లుగా ముగ్గులు వేస్తున్నా



మాది సత్తెనపల్లి వద్ద ఉన్న ధూళిపాళ్ల గ్రామం. ఐదేళ్లుగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నాను. జిల్లాస్థాయి పోటీల్లో రెండుసార్లు ప్రథమ బహుమతి సాధించాను. 2020లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లోనూ మొదటి స్థానం నాదే.

- ఏ.సునీత, గుంటూరు జిల్లా

రెండుసార్లు రాష్ట్రస్థాయి బహుమతి పొందా..



నేను టైలరింగ్ చేస్తాను. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నప్పటి నుంచీ పాల్గొంటున్నా. హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి సాధించాను. తర్వాత 2023లో నిర్వహించిన పోటీల్లో రెండోసారి ప్రథమ బహుమతిని పొందాను. మళ్లీ ఇప్పుడు ద్వితీయ బహుమతి పొందా.

- కె.ఉమాదేవి, అనంతపురం జిల్లా

పదేళ్లుగా పోటీల్లో ఉంటున్నా..



కర్ణాటక, తమిళనాడు సరిహద్దుల్లో నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో ఏటా నేను పాల్గొంటా. పదేళ్లుగా నేను ముగ్గులు వేస్తున్నా. తొలిసారిగా రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఈ పోటీల్లో ద్వితీయ బహుమతి రావడం చాలా ఆనందంగా ఉంది.

- రాధ, తమిళనాడు



విజేతలు వీరే.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి నుంచి ద్వితీయ బహుమతులు అందుకుంటున్న ఏ.సునీత (గుంటూరు), కె.ఉమాదేవి (అనంతపురం), కె.రాధ (తమిళనాడు), కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న ఆర్.ఆశాజ్యోతి (శ్రీకాకుళం), బి.లక్ష్మి (విశాఖపట్నం), టి.ఆదిశ్రీ (పశ్చిమగోదావరి), మల్లీశ్వరి (తూర్పుగోదావరి), పి.పూజిత (కృష్ణా), ఎం.సునీత (నెల్లూరు), సీహెచ్ మణిమంజరి (ప్రకాశం), విద్య (చిత్తూరు), ఎస్.శ్వేత (కడప), ఎస్.రాజేశ్వరి (కర్నూలు), లిఖిత (కర్ణాటక)

ఉమ్మడిగా తేల్చుదాం

- బీజేపీయేతర పక్షాలతోనే ఎన్నికల ముడి
- మరింత బలమైన ఉద్యమాలు చేద్దాం
- ఇక తాడోపేడో తేల్చేద్దాం
- జగన్ సర్కార్‌పై అన్ని చోట్ల భారీ వ్యతిరేకత
- అంగన్‌వాడీలకు అండగా నిలబడదాం : సీపీఎం నిర్ణయం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

'రాబోయే ఎన్నికల్లో పోటీకి వీలుగా ముందుగా సీపీఐతో మాట్లాడుకుందాం. పరస్పరం చర్చించిన తరువాతే మిగతా పార్టీల సంగతి చూద్దాం. అంతకంటే మించి వైసీపీపై వ్యతిరేకత తీవ్రంగా ఉంది. ఈ అంశాలన్నింటినీ ఎక్కడికక్కడ సరి చూసుకుని ముందడుగు వేద్దాం.' అని రెండు రోజులపాటు ఏలూరులో జరిగిన సీపీఎం కార్యవర్గ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయమిది. పలు రాజకీయ అంశాలు, ప్రస్తుత స్థితిగతులు అంతకంటే మించి మార్పులు, చేర్పులు, ఆందోళనలు అన్నిటిపైనా రాష్ట్ర కార్యవర్గం సమగ్రంగా చర్చించింది. కీలక అంశాలపై సుదీర్ఘ చర్చ సాగింది. ప్రత్యేకించి రాజకీయ అంశాలతోపాటు అంగన్‌వాడీ ఆందోళనలపైనా ప్రధాన దృష్టి పెట్టాల్సిందేనని ఏకాభిప్రాయం వెలువడింది. ఆ మేరకు సీపీఎం రాజకీయ అంశాలకు ఎక్కువ సమయం కేటాయించలేదు. ఎలాగూ ఎన్నికల కాలం వచ్చేసింది కాబట్టి ఒక వ్యూహాత్మకంగా ముందుకు వెళ్ళాలని తొలుత వామపక్షాల్లో భాగమైన సీపీఐతో నేరుగా చర్చించాలని, అదికూడా ఎప్పుడు వీలైతే అప్పుడే రంగంలోకి దిగాలని ఒక నిర్ణయానికి వచ్చారు. ఇంతకుముందు సార్వత్రిక ఎన్నికల్లో అప్పట్లో జనసేనతో మిత్రత్వం ఉండేది. ఈసారి మారిన రాజకీయ పరిస్థితులు కారణంగా ఆచితూచి నిర్ణయాలకు సంసిద్ధం కావాల్సిందేనని మరో నిర్ణయానికి వచ్చి బీజేపీయేతర లౌకిక శక్తులను కూడాగట్టుకోవాలని పార్టీ నిర్ణయించింది. ఎందుకంటే మొదటి నుంచి మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా పోరాడుతున్నందున ఇదే మేలైన మార్గంగా అనుసరించాలని, వీలైతే ఇతర పార్టీలతోను సమయం, సందర్భాలను బట్టి మాట్లాడాలని యోచించారు. కాంగ్రెస్ పరిణామాలను కూడా చర్చిస్తూ ఆ పార్టీ ప్రస్తుతం ఏపీలో జరుగుతున్న పరిణామాలను క్షుణ్ణంగా గమనించే ఒక నిర్ణయానికి రావాలని భావిస్తున్నారు. షర్మిల కాంగ్రెస్‌లో ప్రవేశాన్ని స్వాగతించడం మరో పరిణామం.

టీడీపీ, జనసేన, వైసీపీ వంటి ప్రధాన పార్టీలన్నీ బీజేపీతో జతకట్టడాన్ని సమావేశంలో తప్పుపట్టారు. ఈ కారణంగా రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరగడమే కాకుండా కార్పొరేట్ పెట్టుబడులకు అవకాశం కల్పిస్తున్నారని సమావేశం భావించింది. అంతకంటే మించి రాజకీయ అంశాలను సావధానంగా పరిష్కరించుకోవడంతోపాటు ఉద్యమాలను ముందుకు తీసుకువెళ్లే క్రమంపైనే ఎక్కువగా చర్చించారు. ఈ పరిస్థితులన్నింటిపైనా ఎప్పటికప్పుడు సమన్వయపరుచుకుని మిగతా పార్టీలతో మాట్లాడాలని నిర్ణయించారు. మిగతా పార్టీలను అంగన్‌వాడీ సమస్యలపై పూర్తిగా కలుపుకుపోవడంతోపాటు ప్రత్యేక ఉద్యమానికి సన్నద్ధమయ్యేలా సర్కార్ దిగి వచ్చేంత వరకు దీనిని కొనసాగించాలని నిర్ణయించారు. ప్రస్తుత పరిస్థితుల్లో సర్కార్ దిగి వచ్చేంత వరకు వెనక్కి తగ్గకుండా రాజీలేని ఆందోళనలు కొనసాగించాలని కూడా సీపీఎం నిర్ణయించింది. ప్రత్యేక పరిస్థితులను అధ్యయనం చేయడం, పార్టీ విధానాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవడం జరగాలన్నదే కార్యవర్గ ముఖ్య ఉద్దేశంగా భావిస్తున్నారు. రెండు రోజుల పాటు సాగిన కార్యవర్గంలో ఏకబిగిన ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా చర్చించి ఆమోదించడమే కాకుండా భవిష్యత్ కార్యాచరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యుడు మంతెన సీతారాంతో సహా మిగతా నేతలంతా పార్టీ తీసుకున్న నిర్ణయాలపై గురువారం మీడియాతో కూడా మాట్లాడారు.

క్రైం కార్నర్

వేర్వేరుచోట్ల ఆరుగురి మృతి

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో గురువారం వేర్వేరుచోట్ల ఆరుగురు మృతి చెందారు. కారు ఢీకొని దంపతులు, చికిత్స పొందుతూ ఇద్దరు, ఉరేసుకుని వృద్ధుడు, విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందారు.

బంధువుల ఇంటికొచ్చి వెళ్లిన కొద్దిసేపటికే..

- హైవేపై బైక్‌ను ఢీకొన్న కారు.. దంపతులు మృతి



ప్రమాదానికి కారణమైన కారు

ఏలూరు క్రైం, జనవరి 11 : బంధువుల ఇంటికి వచ్చి వారితో సరదాగా మాట్లాడి ఆ తరువాత వెళతామని చెప్పిన కొద్ది సేపటికి ఆ దంపతులు అనంతలోకాలకు వెళ్లిపోయారు. పెదవేగి మండలం మొండూరు పంచాయతీ అంకంపాలెంకు చెందిన చౌటుపల్లి రాటాలు(52), ఆయన భార్య అమ్మాజీ(48) కూలిపనులు చేస్తూ జీవిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉండగా వివాహాలు చేశారు. గురువారం సాయంత్రం ఏలూరు సమీపంలోని దుగ్గిరాలలో ఉన్న బంధువుల ఇంటికి వారిద్దరూ కలిసి బైక్‌పై వచ్చి వారితో కాసేపు సంతోషంగా గడిపారు. అనంతరం ఇంటి నుంచి బయలు దేరి జాతీయ రహదారిపై దుగ్గిరాల బ్రిడ్జి వద్ద నుంచి ఆశ్రం వైపు వెళ్తుండగా మార్గమధ్యలో చొదిమెళ్ల బ్రిడ్జిపై విజయవాడ వైపు నుంచి వెనుక వస్తున్న కారు అతివేగంగా బైక్‌ను ఢీకొనడంతో వీరిద్దరూ ఎగిరి చెల్లాచెదురుగా పడిపోయి అక్కడికక్కడే మృతి చెందారు. హైవే పెట్రోలింగ్ పోలీసులు, ఏలూరు రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రమాదానికి కారణమైన కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ కారులో వారు హైదరాబాద్ నుంచి కాకినాడకు వెళ్తున్నట్టుగా గుర్తించారు. ఈ ఘటన బంధువులనే కాకుండా అంకంపాలెంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ప్రమాద ఘటనపై ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శుక్రవారం ఆ రెండు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించనున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

టి.నరసాపురం, జనవరి11:ప్రమాదవశాత్తు మంటలంటుకుని గాయాలపాలైన ఓ మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. వెలగపాడుకు చెందిన కనిపెడ మంగమ్మ(58) ఈనెల 7న చలిమంట వద్ద కూర్చుని ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని గాయాలపాలైంది. ఈక్రమంలో ఆమెను ముందుగా జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రికి అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె కుమారుడు ఏసుబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బి.సురేంద్ర కుమార్ తెలిపారు.

లారీ ఢీకొని ఒకరి మృతి

ఏలూరు క్రైం, జనవరి 11 : రోడ్డుదాటుతున్న ఓ వ్యక్తిని లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గుంటూరు జిల్లాకు చెందిన కొంతమంది వలస కూలీలు జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి గ్రామానికి వచ్చి పొగాకు కొట్టు పనులకు వెళ్తున్నారు. గురువారం ఉదయం ఆ గ్రామ సెంటర్‌లో మురెడేపల్లి మరియదాస్ (40) రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా అత్యవసర విభాగంలో చికిత్స పొందుతూ కొద్దిసేపటికి మృతి చెందాడు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

ఉరేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

కలిదిండి, జనవరి 11 : తాగిన మైకంలో ఓ వృద్ధుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మూల్లంక పంచాయతీ పరిధిలోని సత్యనారాయణ నగర్‌కు చెందిన సంగాని మోషే (65) బుధవారం రాత్రి తాగిన మైకంలో రామాలయం పక్కనే ఉన్న చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడు కొంతకాలంగా భార్యపిల్లలకు దూరంగా ఉంటూ ఒంటరిగా జీవిస్తున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి తమ్ముడు సంగాని శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ప్రియకుమార్ తెలిపారు.

ఫ్లెక్సీ కడుతుండగా షాక్‌తో యువకుడి మృతి

ఆకివీడు, జనవరి 11: ఫ్లెక్సీ కడుతుండగా కరెంటు షాక్ కొట్టి ఓ యువకుడు చనిపోయిన ఘటన ఆకివీడులో జరిగింది. ఎస్ఐ బత్తిన నాగబాబు తెలిపిన వివరాలివి.. ఆకివీడు బైపాస్ రోడ్డులోని చర్చి వద్ద ఉంటున్న గొల్లూరి దినేష్ (20) ఫ్లెక్సీలు కట్టేందుకు బుధవారం రాతిర పనికి వెళ్లాడు. ఫ్లెక్సీ కడుతున్న సమయంలో విదుత్‌షాక్ కొట్టడంతో ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన చికిత్స నిమిత్తం భీమవరం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు తండ్రి శ్రీరామ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

వరకట్న హత్య కేసులో భర్తకు జీవిత ఖైదు

ఏలూరు క్రైం/గణపవరం, జనవరి 11 :కట్నం కోసం భార్యను హింసిస్తూ మెడలో ఉన్న పసుపు తాడుతోనే మెడ బిగించి హతమార్చిన భర్తపై నేరం రుజువు కావడంతో జీవిత ఖైదు విధిస్తూ ఏలూరులోని మొదటి అదనపు సెషన్స్ కోర్టు న్యాయాధికారి రామ్‌గోపాల్ గురువారం తీర్పు చెప్పారు. దేవరపల్లి గ్రామానికి చెందిన చిమర్తి వరలక్ష్మీ-మల్లయ్య(లేటు) దంపతుల కుమార్తె నంగాలమ్మ (20)ను గణపవరం మండలం పిప్పరకు చెందిన మేడా అబ్బులుకు ఇచ్చి వివాహం చేశారు. వారు పిప్పరలో రొయ్యల చెరువుపై కాపలా ఉంటున్నారు. ప్రతి రోజూ తాగి వచ్చి కట్నం కోసం నంగాలమ్మను అబ్బులు వేధించేవాడు. 2020 జూలై 18న తాగి వచ్చిన అబ్బులు భార్యను కొట్టి పసుపుతాడుతోనే మెడ బిగించి హతమార్చాడు. ఈ ఘటనపై నంగాలమ్మ తల్లి వరలక్ష్మి గణపవరం పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ ఎం.వీరబాబు కేసు నమోదు చేయగా సీఐ భగవాన్‌ప్రసాద్ కేసు దర్యాప్తు చేసి హంతకుడైన అబ్బులును అరెస్టు చేశారు. ఈ కేసులో నిందితుడిపై నేరం రుజువు కావడంతో జీవిత కారాగార శిక్ష, రూ.1500 జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ గ్రేడ్-1 లక్ష్మణనాయక్ వాదించగా ప్రాసిక్యూషన్‌కు నిడమర్రు సీఐ ఎం.సుభాష్, గణపవరం ఎస్ఐ వి. వెంకటేశ్వరరావు, కోర్టు హెచ్‌సీ ఎన్.వేణుగోపాలరావు, జిల్లా కోర్టు మానిటరింగ్ సెల్ అధికారులు సహకరించారు.

బీరు సీసాతో ఒకరిపై దాడి



గాయాలైన రంగబాబు

ఏలూరు క్రైం, జనవరి 11:ఇంటి ముందు ఎందుకు గొడవ చేస్తున్నారంటూ అడిగిన వ్యక్తిపై మరో వ్యక్తి బీరు సీసాతో దాడి చేసి గాయపర్చాడు. ఏలూరు అశోక్‌నగర్ ఏటిగట్టు ప్రాంతానికి చెందిన చెలికాని రంగబాబు ఇంటి ముందు బుధవారం రాత్రి అదే ప్రాంతానికి చెందిన కీర్తి పుల్లారావు, నాని అనేవారు గొడవ పడుతుండగా రంగబాబు వెళ్లి తమ ఇంటి ముందు ఎందుకు గొడవ పడుతున్నారని ప్రశ్నించడంతో వారిద్దరు వెళ్లిపోయారు. ఆ తరువాత మళ్ళీ కీర్తి పుల్లారావు వచ్చి రంగబాబును బయటకు పిలిచి బీరు సీసాతో దాడిచేసి కొట్టారు. గాయాలపాలైన రంగబాబును ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం సీసాతో దాడి..ఒకరికి గాయాలు

భీమడోలు, జనవరి 11 : భీమడోలు మండలం పూళ్ళ గ్రామంలో ఇరువురి మధ్య ఉన్న తగాదాల నేపథ్యంలో మద్యం షాపులో గురువారం నూతులపాటి పాల్‌పై సిద్దాబత్తుల విష్ణుష్ అనే వ్యక్తి ఖాళీ మద్యం సీసాతో దాడి చేశాడు. పాల్‌కు గాయాలు కాగా 108 అంబులెన్స్‌లో ఏలూరు జిల్లా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

బ్యాంకు ఖాతాలో రూ. 68,450 మాయం

- లబోదిబోమంటున్న ఖాతాదారుడు.. పోలీసులకు ఫిర్యాదు

ఆచంట, జనవరి 11 : ఆచంట ఎస్‌బీఐ బ్రాంచిలోని ఒక ఖాతాదారుడి ఖాతాలో వున్న రూ.68,450 మాయమైన ఘటన జరిగింది. ఆచంట శివారు పెదపేటకు చెందిన నక్కా మోహనరావుకు చెందిన ఎస్‌బీఐ ఖాతా నుంచి డిసెంబరు 2 నుంచి 11 వ తేదీలోపు పలు దఫాలుగా డ్రా చేసినట్టు తెలిపాడు. పిల్లల చదువు నిమిత్తం ఖాతాలో ఎప్పుడూ రూ.50 వేలు ఉంటాయని.. ఈనెల 10న తన కుమారుడు సెల్‌ఫోన్ రీచార్జి నిమిత్తం డబ్బులు ఫోన్‌పే చేస్తుండగా ఖాతాలో డబ్బులు లేనట్టు చూపించడంతో అవాక్కయ్యాడు. వెంటనే బ్యాంక్ వద్దకు వెళ్లి విషయం తెలుపగా పలు దఫాలుగా విత్‌డ్రా చేసినట్టు బ్యాంక్ స్టేట్‌మెంట్‌లో నిర్ధారణైంది. ఖాతాదారుడితో పాటు బ్యాంకు మేనేజర్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని బ్యాంక్ అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. బ్యాంక్ అధికారులు ఎలా జరిగిందో దర్యాప్తు చేసి తన డబ్బులు వచ్చేలా చూడాలని ఖాతాదారుడు కోరుతున్నాడు.

రేపటి నుంచి మావుళ్ళమ్మ ఉత్సవాలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

భీమవరంటౌన్, జనవరి 11 :శ్రీమావుళ్ళమ్మ అమ్మవారి 60వ వార్షిక జాతర ఈనెల 13 నుంచి ఫిబ్రవరి 9వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం, ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 13న ఉదయం రామయాణం గోవిందరావు, వెంకటేశ్వరి దంపతులచే అమ్మవారికి కుంకుమపూజలు, కలశస్థాపనతో కార్యక్రమాలకు శ్రీకారం చుడతామన్నారు. ఉత్సవాన్ని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభిస్తారన్నారు. సాయంత్రం కొటికలపూడి గోవిందరావు కళావేదికపై ఉత్సవాలను మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల ప్రారంభిస్తారన్నారు. వచ్చేనెల 6 వరకు ఏకధాటిన సాంస్కృతిక కార్యక్రమాలు, 7,8 తేదీలు విశ్రాంతి దినాలుగా ఉంటాయని 9న శుక్రవారం అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం, ఉత్సవ కమిటీ సభ్యులు తుటారపు ఏడుకొండలు, రామాయణం గోవిందరావు, కొప్పుల సత్యనారాయణ, రామాయణం చిన్నారి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి క్షేత్రానికి అమావాస్య ఎఫెక్ట్



నామమాత్రంగా క్యూలైన్‌లో వున్న భక్తులు

ద్వారకాతిరుమల, జనవరి 11 : శ్రీవారి క్షేత్రానికి వచ్చే భక్తుల రద్దీపై అమావాస్య తన ప్రభావాన్ని చూపింది. ప్రతినిత్యం ఆలయానికి వేలాదిగా భక్తులు తరలివస్తారు. ఈ గురువారం అమావాస్య కావడంతో ఆలయానికి వందల సంఖ్యలోనే యాత్రికులు తరలివచ్చారు. ఆలయంలోని అన్ని విభాగాలు దాదాపు ఖాళీగా కన్పించాయి. దేవస్థానం, ప్రైవేటు ఫాన్సీ దుకాణాలు మధ్యాహ్నం సమయానికి మూతపడ్డాయి.

విలాస మండపంలో.. శ్రీవారికి ఉత్సవం

శ్రీవారి క్షేత్రవిలాస మండపంలో శ్రీవారు, అమ్మవార్లు, గోదాదేవికి గురువారం ఉదయం జరిగిన ఉత్సవం భక్తులకు నేత్రపర్వమైంది. ముందుగా స్వామి, అమ్మవార్లను గోదాదేవితో కలసి తొళక్కవాహనంపై ఉంచి ప్రత్యేక అలంకరణలు చేశారు. అనంతరం క్షేత్రపురవీధుల్లో ఊరేగించారు. విలాసమండపంలో మూర్తులను ఉంచి అర్చకులు, ప్రత్యేక పూజలు జరిపి, హారతులు సమర్పించారు. భక్తులకు తీర్థ, ప్రసాదాలను పంపిణీ చేశారు.

'లంపీస్కిన్' నివారణకు చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆకివీడు, జనవరి 11: దూడలకు రోగనిరోధకశక్తి లేకే లంపీస్కిన్ వ్యాధి బారినపడి చనిపోతున్నాయని, ఈ వైరస్ అంటువ్యాధి కావడంతో పశుసంవర్థక రైతులు చికిత్స కంటే నివారణ చర్యలపై దృష్టిపెట్టాలని భీమవరం డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ జవహర్ హుస్సేన్ స్పష్టం చేశారు. గురువారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన ఉసురు తీస్తున్న లంపీస్కిన్ కథనంపై అధికారులు స్పందించి గోశాలలు పరిశీలించి మాట్లాడారు. గత ఏడాది సెప్టెంబరులో 1055 తెల్ల ఆవులకు ముద్దచర్మానికి సంబంధించి వ్యాక్సిన్ వేశామన్నారు. ఇటీవల గాలికుంటు టీకాలు 2,200 తెలుపు, నలుపు ఆవులకు వేశామన్నారు. ఈనెలాఖరు వరకు టీకాలు వేస్తారన్నారు. నెలకొకసారి తమ పరిధిలోని గోశాలలు పరిశీలించాలని ఏడీ జనార్దనరావుకు సూచించారు.

గోవా మద్యం బాటిళ్లు స్వాధీనం.. ఒకరి అరెస్ట్

తణుకు, జనవరి 11 : వేల్పూరుకు చెందిన వ్యక్తి నుంచి గోవాకు చెందిన విస్కీ బాటిల్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. గురువారం రూరల్ ఎస్ఐ కె.చంద్రశేఖర్‌కు వచ్చిన సమాచారం మేరకు వేల్పూరుకు చెందిన అయిశెట్టి పాపారావు అనే వ్యక్తి వద్ద గోవాకు చెందిన విస్కీ 25 ఫుల్ బాటిల్స్ 8 క్వార్టర్ బాటిల్స్ ను స్వాధీనం చేసుకుని అరెస్టు చేశామని తెలిపారు. ముద్దాయిని న్యాయమూర్తి ముందు హాజరుపర్చినట్టు చెప్పారు.

కవులు, రచయితలకు పురస్కారాలు



పురస్కారం అందుకున్న కత్తిమండ

ఏలూరు కల్చరల్, జనవరి 11 : రాష్ట్ర సాహిత్య అకాడమి, వైఎంహెచ్ఏ, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ భోగి మంట వేసి సంబరాలు ప్రారంభించారు. జేసీ లావణ్యవేణి, రాష్ట్ర సాహిత్య అకాడమి ఛైర్మన్ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. పది మంది కవులు, రచయితలకు విశిష్ఠ సాహిత్య పురస్కారం, రూ.10వేలు నగదు జేసీ లావణ్యవేణి అందజేశారు. 26 జిల్లాల నుంచి ఎంపిక చేసిన కళాకారులకు రూ.5వేలు చొప్పున నగదు పురస్కారం అందించారు. జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఆర్డీవో ఖాజావలీ, ఏఎంసీ ఛైర్మన్ నెరుసు చిరంజీవులు, నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటకృష్ణ, సెట్‌వెల్ సీఈవో మెహర్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

ఏలూరు క్రైం, జనవరి 11: రానున్న సార్వత్రిక ఎన్నికలను శాంతియుతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిపేలా అన్ని చర్యలు చేపట్టాలని ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో డీఎస్పీలు, సీఐలతో గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియ, విధి విధానాలపై అవగాహన ఉండాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, నియమ నిబంధనలు, సంబంధిత చట్టాలు, నేరాలు, ఎన్నికల్లో నగదు, మద్యం అక్రమ రవాణా, అక్రమ ఆయుధాలు ఇతర ప్రభావిత వస్తువులకు అడ్డుకట్ట వేసే చర్యలు పటిష్టంగా తీసుకోవాలన్నారు. ఏఎస్పీ ఎంజెవి భాస్కరరావు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ బోణం ఆది ప్రసాద్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ తవ్వకాలు నిలిపివేయాలి



తమ వద్ద పట్టాలను చూపుతున్న రైతులు

టి నరసాపురం, జనవరి 11: గత ప్రభుత్వం తమకు పట్టాలు ఇచ్చిన భూముల్లో గ్రావెల్ తవ్వకాలు నిలిపివేయాలని కోరుతూ కేతవరం రైతులు ఎక్స్‌కవేటర్‌ను అడ్డుకున్నారు. సర్వే నెం 1/1లో సుమారు 1165 ఎకరాల భూమి ఉంది. 2004లో 420 ఎకరాలు అప్పటి ప్రభుత్వం పేదలకు పంపిణీ చేయగా 2017లో మళ్లీ 116 మందికి పట్టాలిచ్చారు. హైవే సిబ్బంది గురువారం గ్రావెల్ తవ్వకాలు చేపట్టడంతో రైతులు అడ్డుకున్నారు. మట్టి తవ్వకాలకు ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించామని, అనుమతులు పొందాకే తవ్వకాలు చేపట్టినట్టు హైవే సిబ్బంది తెలిపారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణ నెలకొంది. డీటీ రాధాకృష్ణ అక్కడకు చేరుకుని వారివద్ద పత్రాలను శుక్రవారం తహసీల్దార్ కార్యాలయానికి రావాలని సూచించారు. దీంతో వివాదం తాత్కాలికంగా సద్దుమణిగింది. పలువురు రైతులు పాల్గొన్నారు.

దివ్యాంగులను అవహేళన చేస్తే కఠిన శిక్ష



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పూర్ణిమ

పెదవేగి, జనవరి 11: దివ్యాంగులను అవహేళన చేస్తే కఠిన శిక్షలు ఉంటాయని పీహెచ్‌సీ వైద్యాధికారి పూర్ణిమ అన్నారు. దొండపాడు ఉమా ఎడ్యుకేషన్, టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం వైకల్య నివారణ, 2016 దివ్యాంగుల హక్కుల పరిరక్షణ చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైకల్యం నివారణకు ముందు జాగ్రత్తలు మేలన్నారు. 18 ఏళ్ళు రాకుండా వివాహం చేయడం, గర్భదారణ వంటివి వైకల్యానికి కారణమవుతాయని ఆమె వివరించారు. సంస్థ కోఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి దివ్యాంగుల రక్షణ చట్టాలు, హక్కులను తెలియపర్చారు.

60 మంది ఉద్యోగులు, విద్యార్థుల రక్తదానం

ఏలూరు క్రైం, జనవరి 11: అంబేద్కర్ 125 అడుగుల సామాజిక న్యాయ మహాశిల్పం ఆవిష్కరణ సందర్భంగా సామాజిక సమతా సంకల్ప కార్యక్రమంలో భాగంగా ఉద్యోగులు, విద్యార్థులు ఏలూరులో రక్తదానం చేశారు. ప్రభుత్వాసుపత్రి ఆవరణలోని రెడ్‌క్రాస్ భవనంలో గురువారం 60 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ ఛైర్మన్ బీవీ కృష్ణారెడ్డి, ఇన్‌చార్జి జిల్లా వైద్యాధికారి నాగేశ్వరరావు, డీపీవో టి శ్రీనివాస విశ్వనాథ్, డ్వామా పీడీ ఎ.రాము, ఆర్టీసీ డిప్యూటీ సీటీఎం వర ప్రసాద్ పాల్గొన్నారు. వైద్య సిబ్బంది, ఆర్టీసీ, పంచాయతీరాజ్, డ్వామా సిబ్బంది రామచంద్ర కళాశాల విద్యార్థులు, ఏలూరు ఇంజనీరింగ్ విద్యార్థులు రక్తదానం చేశారు.

మినీ జాబ్ మేళాకు విశేష స్పందన

ఏలూరు కలెక్టరేట్, జనవరి 11: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో టీటీడీసీ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన మినీ జాబ్ మేళాకు 89మంది యువత హాజరయ్యారు. 28 కంపెనీల్లో ఉపాధి పొందినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఘంటా సుధాకర్ తెలిపారు. హెటిరో డ్రగ్స్, పేటీఎమ్, ఇన్నోవసొర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధికార్యాలయం అధికారి మధుభూషణ్, ఎంగ్ ప్రొఫీసస్ ప్రవీణ్, ప్లేస్‌మెంట్ అధికారి కె.ప్రవీణ్, స్కిల్‌కాలేజ్ కోఆర్డినేటర్ రాజరాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్‌పై సర్పంచ్‌ల గగ్గోలు

వాడి వేడిగా ఉంగుటూరు మండల పరిషత్ సమావేశం

ఉంగుటూరు, జనవరి 11: మండలంలోని పలు గ్రామాల సర్పంచ్‌లు లేవనెత్తిన సమస్యలతో మండల పరిషత్ సమావేశం దద్దరిల్లింది. ఎంపీపీని సమస్యలపై సర్పంచ్ ప్రశ్నించగా ఎంపీపీ భర్త వాగ్వాదానికి దిగడంతో సమావేశంలో గందరగోళం నెలకొంది. ఎంపీపీ భర్తను సమావేశానికి ఎలా అనుమతించారని, పట్టించుకోని అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి అధ్యక్షతన గురువారం జరిగిన మండల పరిషత్ సమావేశంలో సర్పంచ్‌లు ప్రొటోకాల్ సమస్యలు, పంచాయతీ నిధులను ప్రభుత్వం మళ్లించడంపై నిలదీశారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించడంలేదని చేబ్రోలు సర్పంచ్ రాందే లక్ష్మీసునీత, తల్లాపురం సర్పంచ్ పసుపులేటి నరసింహరావు, కాకర్లమూడి సర్పంచ్ కాళ్ల నాగ వెంకట సత్యనరాయణ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపిడివోకు ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి సూచించారు. చేబ్రోలు సర్పంచ్ రాందే లక్ష్మీసునీత మాట్లాడుతూ కేంద్రం నేరుగా వస్తున్న నిధులను తమకు తెలియకుండా రాష్ట్ర ప్రభుత్వం లాగేసుకుంటుందని, తాము లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పనులు చేయిస్తున్నామని, పంచాయతీల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. పింఛన్ల పంపిణీపై సమాచారం ఇవ్వడం లేదని తల్లాపురం సర్పంచ్ నరసింహారావు, గ్రామ సచివాలయ నిర్మాణానికి ఆటంకాలు కలిగిస్తున్నారని కాకర్లమూడి సర్పంచ్ నాగ సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. తల్లాపురం సర్పంచ్ నరసింహారావు ఎంపీపీని ప్రశ్నిస్తుండగా ఆమె భర్త సుబ్బారావు ఒక్కసారిగా సమావేశ మందిరంలో చొరబడి వాగ్వాదానికి దిగడంతో గందరగోళం నెలకొంది. సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందేల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు ఎస్ఐ కిరణ్ కుమార్ వివరించారు.

మొక్కుబడిగా బుట్టాయగూడెం మండల సమావేశం

బుట్టాయగూడెం, జనవరి 11: మండల పరిషత్ సమావేశం మొక్కుబడిగా సాగింది. ఎంపీపీ కారం శాంతి అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం గైర్హాజరయ్యారు. ప్రజాసమస్యల ప్రాస్తవనే లేకుండా పలు శాఖలు చేపట్టిన పనులను వివరాలతో సమావేశం అయిందనిపించారు. సమావేశంలో ఎంపిడివో ఎస్.వేణుగోపాలరెడ్డి, ప్రజాప్రతినిధులు, కొద్ది మంది అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



ఏలూరులో అంగన్‌వాడీల నిరసన



చింతలపూడి శిబిరంలో అంగన్‌వాడీల నినాదాలు



పోలవరంలో అంగన్‌వాడీల ధర్నా



లింగపాలెం శిబిరంలో అంగన్‌వాడీల కోలాటం

సమ్మె హోరు

నిరసన శిబిరాల్లో అంగన్‌వాడీల నినాదాలు

చింతలపూడి, జనవరి 11: అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మె గురువారం 31వ రోజుకు చేరుకుంది. నిరసన శిబిరంలో కార్యకర్తలు నినాదాలతో హోరెత్తించారు. శిబిరంలో సీఐటీయు నాయకులు నత్తా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అంగన్‌వాడీలు ప్రధానమైన మూడు సమస్యల పరిష్కారం సమ్మె, నిరసన కొనసాగిస్తున్నామన్నారు. తెలంగాణ కంటే అదనంగా రూ.వెయ్యి ఇస్తానన్న హామీ నెరవేర్చాలని, మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా గుర్తించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ చెల్లించాలన్నారు. కార్యకర్తలు శిబిరంలో నినాదాలు చేసి తమ ఐక్యతను చాటారు.

- పోలవరం: అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ సమ్మె కొనసాగుతోంది. అంగన్వాడీలపై దీక్షలపై అణచివేత చర్యలు దుర్మార్గమని, నోటీసులు ఇచ్చి 18 వ తేదీలోగా విధులకు హాజరుకాకపోతే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని బెదిరింపులకు పాల్పడడం ప్రభుత్వానికి తగదని అంగన్వాడీల నాయకురాలు పిఎల్ఎస్ కుమారి అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా నినాదాలు చేశారు. పద్మ, సరస్వతి, హైమవతి, కుబ్ర, జుబేద, వెంకటరమణ, సత్యవతి, విజయ తదితరులు పాల్గొన్నారు.
- లింగపాలెం: తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో అంగన్‌వాడీల సమ్మె 31 రోజుకు చేరుకుంది. వీఆర్వోలు, గ్రామ కార్యదర్శులు, మహిళా కానిస్టేబుళ్ల ద్వారా నోటీసులు అందజేశారు. అంగన్‌వాడీలు నోటీసులు తీసుకోకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రాలు, అంగన్‌వాడీల గృహాలకు అంటించి వెళ్ళారు. తప్పనిసరిగా విధులకు హాజరుకావాలని హెచ్చరించినా ఎట్టిపరిస్థితుల్లోనూ సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు. అంగన్‌వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం ప్రభుత్వ పిరికితనమని వారు ఎద్దేవా చేశారు. బీజేఎన్ కుమారి, వి.ఈశ్వరి, లింగపాలెం మండలంలోని అంగన్‌వాడీలు పాల్గొన్నారు.
- బుట్టాయగూడెం: సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె విరమించబోమని అంగనవాడీలు స్పష్టం చేస్తున్నారు. కృపామణి, నూర్జహాన్, మున్నీ, శ్రీదేవి, రామమ్మ, రామలక్ష్మి, రామయమ్మ అంగనవాడీలు పాల్గొన్నారు.

షోకాజ్ నోటీసులు సరికాదు

జంగారెడ్డిగూడెం టౌన్: అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకపోగా విధుల్లో చేరాలని షోకాజ్ నోటీసులు జారీ చేయడం సరికాదని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.రామ్మోహన్ అన్నారు. 31 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న అంగనవాడీల ఇళ్లకు నోటీసులు అంతికించడం భయపెట్టడమేనన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అంగన్వాడీల సమస్యలు చర్చల ద్వారా పరిష్కరించాలన్నారు. ఎస్మా చట్టం ప్రయోగిస్తూ జీవో నెంబర్ 2 విడుదల చేశారన్నారు. అయినప్పటికీ అంగనవాడీలు వెనకంజ వేయకుండా ఉద్యమం కొనసాగిస్తున్నారన్నారు. ప్రభుత్వం గమనించి చర్చల ద్వారా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అంగన్వాడీలపై కక్షసాధింపు చర్యలకు దిగడం, భయభ్రాంతులకు గురిచేయడం సరైనది కాదని, అంగన్వాడీల డిమాండ్స్ వెంటనే పరిష్కారం చేయాలని రామ్మోహన్ డిమాండ్ చేశారు.



కె.కన్నాపురంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన నాయకులతో చింతమనేని



జంగారెడ్డిగూడెంలో మాట్లాడుతున్న దాసరి శేషు, నేతలు

సంక్షేమం కాదు

సంక్షోభం

వైసీపీ పాలనపై చింతమనేని ధ్వజం

పెదవేగి, జనవరి 11: జగన్ పాలనలో రాష్ట్రంలో సంక్షేమం లేదని, అంతా సంక్షోభమేనని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ధ్వజమెత్తారు. బి.సింగవరంలో గురువారం జరిగిన బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో వైసీపీ పాలనలో అక్రమాలు, అవినీతిని ఎండగట్టారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనించాలంటే టీడీపీ- జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. బి.సింగవరం- జానంపేట గ్రామాల ప్రజల చిరకాల కోరిక తమ్మిలేరుపై వంతెన నిర్మాణం పూర్తి చేస్తానని ప్రభాకర్ హామీ ఇచ్చారు. మరో రెండునెలల్లో ఎన్నికలు జరుగుతాయని, ఆ ఎన్నికల్లో టీడీపీ- జనసేన కూటమి విజయం సాధిస్తుందని, ఆ వెంటనే బ్రిడ్జి నిర్మాణం ప్రారంభిస్తామని చెప్పారు. దీంతోపాటు సాగునీటి అవసరాలకు అనుగుణంగా నీరు అందుబాటులో ఉండేలా చేస్తామని ప్రభాకర్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, పరసా వీరాస్వామి, మాజీఎంపీపీ దేవరపల్లి బక్కయ్య, వి.నరేష్, అడపా శ్రీను, కోదండరామయ్య వెంకటనారాయణ, దుర్గాప్రసాద్, సురేష్, జనసేన నాయకులు మధుసూదన్, భారీఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు

దెందులూరు నియోజకవర్గంలో పలువురు నేతలు వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నారు. చింతమనేని ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాల్లో కె.కన్నాపురం, కూచింపూడి, న్యాయంపల్లి, దెందులూరు మండలం పెరుగ్గూడెం గ్రామాలకు చెందిన నాయకులు, తమ అనుచరగణంతో టీడీపీలో చేరారు. అవినీతి, అక్రమాలతో నిండిన వైసీపీలో నాయకుల దందాలు, అసమర్థ పాలనతో విసిగి, టీడీపీలో చేరుతున్నామని పార్టీ మారిన నాయకులు బండారు రాజు, రాము, జక్కా రాజేష్, పెద్దిశెట్టి వెంకటేశ్వరరావు, పూజారి రాటాలు, బాలిన బాలాజీ, నిట్టా కృష్ణ, పెద్దిశెట్టి గంగరాజు, బండారు బాలాజీ. పఠాన్ నాగుల్ మీరా, కొమ్మిన ప్రసాద్, కోటగిరి వాసుబాబు, సీతారామస్వామి, వెల్లంకి సీతారామస్వామి, శ్రీనివాసరావు, అరుణ్, చలపాటి వెంకట రమణ, బొబ్బూరి రవికుమార్, ఆనంద్, చుంచుల రాంబాబు, మల్లవల్లి నవీన్, సాయిన నాగేశ్వరరావు, కొమ్మిన గంగరాజు, బాలిన సాయిబాబు తదితరులు తెలిపారు. వారికి చింతమనేని ప్రభాకర్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

వైసీపీలో బీసీలను బలిపశువులను చేస్తున్నారు

జంగారెడ్డిగూడెంటౌన్: వైసీపీలో బీసీలను బలిపశువులను చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్ర శేషు విమర్శించారు. బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, విశ్వకర్మ రాష్ట్ర డైరెక్టర్ చిత్రోజు తాతాజీతో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. నా బీసీలు అంటూ జగన్ తడిగుడ్డతో బీసీల గొంతు కోస్తున్నాడని అన్నారు. పేరుకే బీసీలకు మంత్రి పదవులు కానీ పెత్తనం తన సొంత సామాజిక వర్గాల సామంతరాజులకేనన్నారు. కేవలం ప్రతిపక్ష నేతలను తిట్టడానికి తప్ప తమ శాఖల సమీక్షకు కూడా మంత్రులు పనికిరాకుండా చేస్తున్నారన్నారు. బీసీలకు వైసీపీలో అవమానాలను ఆ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యేలు చెప్పడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. 75 వేల కోట్ల బీసీల సబ్ ప్లాన్ నిధులను కూడా పక్కదారి పట్టించి, స్థానిక సంస్థల్లో 10శాతం కోత విధించి 16వేల పదవులను బీసీలకు దూరం చేసిన ముఖ్యమంత్రి జగన్ అని అన్నారు. వైసీపీలో ఉన్న బీసీలందరు అవమానాలతో బాధపడవద్దని, బయటకు రావాలని శేషు పిలుపునిచ్చారు. చిత్రోజు తాతాజీ మాట్లాడుతూ బీసీలకు గౌరవం ఒక్క తెలుగుదేశం పార్టీలో మాత్రమే ఉందన్నారు. రానున్న రోజుల్లో బీసీల కోసం రక్షణ చట్టాన్ని కూడా తెస్తామని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీసీ నేతలు కొంచాడ ప్రసాద్, వీరమళ్ల పోసిబాబు, బూత్ ఇంచార్జ్ పులపాకుల విజయ్ తదితరులు పాల్గొన్నారు.



ఏలూరు సమావేశంలో మాట్లాడుతున్న బడేటి చంటి

అత్యధిక మెజారిటీతో గెలిపించాలి

ఏలూరు టూటౌన్: ఎన్నికలు దగ్గర పడుతున్న దృష్ట్యా నాయకులు, కార్యకర్తలు విజయమే లక్ష్యంగా పని చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బడేటి చంటి అన్నారు. క్యాంప్ కార్యాలయంలో గురువారం క్లస్టర్, డివిజన్, బూత్ ఇన్‌చార్జ్‌ల సమావేశం నిర్వహించారు. చంటి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి విజయానికి కృషి చేయాలని దిశా, నిర్దేశం చేశారు. బూత్‌ఇన్‌చార్జ్‌లు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు అనుసరించాల్సిన వ్యూహాలు వివరించారు. వైసీపీ పరిస్థితి నియోజకవర్గంలో దారుణంగా ఉందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉమ్మడి అభ్యర్థి విజయానికి కృషి చేయాలన్నారు.

యువత జూదం జోలికి పోవద్దు

జంగారెడ్డిగూడెంటౌన్, జనవరి 11: డాంగే నగర్ అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, సీఐ పి.రాజేష్‌లో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. యువత జూదం జోలికి పోవద్దని సీఐ రాజేష్ సూచించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి మాట్లాడుతూ ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కౌన్సిలర్లు మానవత మూర్తి, కె.లావణ్య, బత్తిన చిన్న, అంబేడ్కర్ యువజన సంఘ వ్యవస్థాపకులు అమృతల రంగా, నెలపోలు ప్రభాకర్‌రావు, అధ్యక్ష కార్యదర్శులు కె.లక్ష్మణరావు, పఠాన్ బాజీ పాల్గొన్నారు.

కోడి పందేలు, జూదం నివారణకు చర్యలు

కామవరపుకోట, జనవరి 11: మండలంలో 144సెక్షన్ విధించినట్టు తహసీల్దార్ డి.వి.సత్యనారాయణ తెలిపారు. సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు, జూదం నివారణకు ముందస్తు చర్యలు తీసుకున్నామని చెప్పారు. గతంలో కోడిపందేలు, జూదాలు ఆడిన వారిని బైండోవర్ చేశామన్నారు. డీటీ శేషగిరి, వీఆర్వోలు ఎం.డి.మెహబూబ్ సాహెబ్, రమేష్, నాగయ్య, కంకిపాటి నాగేశ్వరరావు, కొయ్యగూర బాబూరావు పాల్గొన్నారు.

పోలవరం: కోడి పందేలు, జూదం నిర్వహించొద్దని తహసీల్దారు బి.సుమతి సూచించారు. పోలవరంలో జరిగిన గ్రామసభలో తహసీల్దారు మాట్లాడుతూ క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ ఆటలతో ఆరోగ్యమన్నారు. ఎస్ఐ పవన్ కుమార్ కోడి పందేలు, జూదంతో అనర్థాలు వివరించారు.

- బుట్టాయగూడెం: మండలంలోని 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఎవరైనా అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ ఎస్.శారాశాంతి హెచ్చరించారు. సంక్రాంతి పండుగ ముసుగులో కోడిపందేలు, జూదానికి ప్రజలు దూరంగా ఉండాలన్నారు.

నేడు పారిజాతగిరిలో కూడార్రై మహోత్సవం

జంగారెడ్డిగూడెంటౌన్, జనవరి 11: గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కూడార్రై మహోత్సవం జరుగుతుందని ఆలయ ఈవో మానికల రాంబాబు తెలిపారు. ప్రసాదం నివేదన, గోదా, శ్రీకృష్ణ వేషధారణ జరుగుతుందన్నారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదములు స్వీకరించి గోదా రంగనాథుల అనుగ్రహం పొందాలని కోరారు.

ఎస్ఐగా ఎంపికైన యువకుడికి గ్రామస్తుల సత్కారం



యువకుడిని సత్కరిస్తున్న సర్పంచ్

లింగపాలెం, జనవరి 11: వేములపల్లి గ్రామానికి చెందిన ముద్దల సీతారామ్ ఎస్ఐ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. తమ గ్రామం నుంచి ఒకరు ఎస్సై కావడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. సర్పంచ్ నత్తా దివ్య పంచాయతీ వద్ద గురువారం సీతా రామ్‌ను సత్కరించారు. సీతారామ్ ఇంకా మరెన్నో ఉన్నత స్థానాలు అధిరోహించాలని వారు కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు నత్తా నాగేంద్ర, పంచాయతీ సిబ్బంది, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలి

బుట్టాయగూడెం, జనవరి 11: ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ ఎం.సూర్యతేజ అన్నారు. ప్రతి గ్రామంలో జాతీయ జెండాను ఏర్పాటు చేయాలన్న ఉద్దేశ్యంతో రెడ్డిగూడెంలో గురువారం జాతీయ జెండా ఆవిష్కరించారు. కొండరెడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు పీవో తెలిపారు. కార్యక్రమంలో ఈఈ, ఏపీడీ, డీవైఈవో, ఏఎంవో, జడ్పీటీసీ మొడియం రామతులసి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

భీమడోలు, జనవరి 11: మండలంలో ఉపాధి పనులపై మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక గురువారం జరిగింది. కొలతల నమోదులో తేడాలు జరిగినట్లు సంబంధిత అధికారులు గుర్తించారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ సంచాలకులు రాము, జిల్లా విజిలెన్సు అధికారి విజయలక్ష్మి ఉపాధి హామీ పనుల్లో తేడాలను సభలో ప్రస్తావించారు. సామాజిక తనిఖీ కార్యక్రమంలో క్షేత్రస్థాయి తనిఖీ కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది వ్యక్తిగత అభిప్రాయాలను తీసుకున్నారు. ఉపాధి హామీ పథకంలో ఆడిట్ అభ్యంతరాలు ఉన్నాయని, సాంకేతిక లోపాల కారణంగా ఇవి జరిగినట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధిహామీ ఏపీడీ జి సుధాకర్, ఎస్ఆర్‌పి గౌరీ శంకర్, పద్మావతి దేవి, ఎంపీపీ రామయ్య, తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నేతలు

వైసీపీ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత

ఏలూరు టూటౌన్, జనవరి 11: వైసీపీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని ఈ పరిస్థితుల్లో దెందులూరు నియోజకవర్గంలో టీడీపీ, జనసేన కూటమిలో సచ్ఛీలుడైన వ్యక్తిని ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబెడితే విజయం సాధ్యమని జనసేన పార్టీ నాయకులు కొఠారు ఆదిశేషు అన్నారు. జనసేన, టీడీపీలోనే ఒక వర్గం గురువారం విలేఖర్ల సమావేశం నిర్వహించింది. ఆదిశేషు మాట్లాడుతూ దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరిపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. నియోజకవర్గంలో కాపు సామాజిక వర్గం ఎక్కువని, జనసేన అభ్యర్థికి సీటు కేటాయించాలన్నారు. టీడీపీ నాయకులు రాయల భాస్కరరావు మాట్లాడుతూ జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థిగా కొత్త వ్యక్తిని ఎమ్మెల్యేగా నిలపాలన్నారు. కాపుసేన అధ్యక్షుడు పులి శ్రీరామ్ మాట్లాడుతూ కొఠారు ఆదిశేషును జనసేన అభ్యర్థిగా నిలబెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆలపాటి దత్తు, విద్యాసాగరరావు, పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె తాత్కాలిక విరమణ

ఏలూరు టూటౌన్, జనవరి 11: మున్సిపల్ కార్మికులు తాత్కాలికంగా సమ్మె విరమించారు. నాయకులు జరిపిన చర్చల్లో కొన్ని కోర్కెలు మాత్రమే నెరవేర్చారు. కార్మికులు అసంతృప్తిగానే తాత్కాలికంగా సమ్మెకు విరామం ప్రకటించారు. చర్చల సందర్భంగా ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే మళ్లీ సమ్మె తప్పదని సీఐటీయూ నాయకులు సోమయ్య తెలిపారు. గురువారం సమ్మె విరమించి కార్మికులు విధుల్లో చేరారు.

తెలంగాణ మంత్రి తుమ్మలను కలిసిన టీడీపీ నేతలు



తుమ్మలను సన్మానిస్తున్న టీడీపీ నేతలు

చింతలపూడి, జనవరి 11: తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును టీడీపీ చింతలపూడి నేతలు గురువారం ఆయన స్వగ్రామం గండుగులపల్లిలో కలిశారు. మంత్రిగా ఎన్నికైన తరువాత ఆయన స్వగ్రామానికి వెళ్ళి కలిసి శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు ఇక్కడ బంధుత్వంతో పాటు పార్టీ నాయకులతో సంబంధాలు ఉన్నాయి. జె.ముత్తారెడ్డి, మాజీ ఎంపిటిసి రాజశేఖరరెడ్డి, టీడీపీ రైతు జిల్లా అధ్యక్షుడు గుత్తా వెంకటేశ్వరరావు, మాటూరి వెంకట్రామయ్య, అప్పన్నదొర పలువురు నాయకులు ఆయనను కలసి శుభాకాంక్షలు తెలిపారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు క్రైం :** జిల్లాలో పోలీసులు బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకూ విస్తృతంగా వాహనాలను తనిఖీ చేశారు. రాత్రి వేళ రోడ్డు ప్రమాదాలు జరుగకుండా వాహన డ్రైవర్లకు ఫేస్‌వాష్ కార్యక్రమాన్ని నిర్వహించారు.
- **ఏలూరు కార్పొరేషన్ :** ఆర్‌ఆర్ పేట వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. వేకువజామునే స్వామివారి సన్నిధిలో తిరుప్పావై ప్రవచనాలు, గోవిందనామ సంకీర్తనలు, పాశురాల పఠనలు జరిపారు.
- **ఏలూరు ఎడ్యుకేషన్ :** ఆదిత్య డిగ్రీ కళాశాలలో గురువారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని జాతీయ యువజనోత్సవాన్ని నిర్వహించారు. స్వాతంత్ర్యం అనంతరం 77 ఏళ్ల సవాళ్లపై విద్యార్థులకు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. గండికోట శ్రీనివాస్, ప్రిన్సిపాల్ వి.వెంకటేశ్వరరావు, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ లోకేష్‌కుమార్ పాల్గొన్నారు.
- **చింతలపూడి :** గ్రామీణ క్రీడాకారుల్లో నైపుణ్యం పెరగాలని రాష్ట్ర ఫైర్ సర్వీస్ అండ్ డిజాస్టర్ సర్వీస్ డీజీపీ పీవీ.సునీల్‌కుమార్ అన్నారు. అంబేడ్కర్ ఇండియా మిషన్(ఎయిమ్) సంస్థ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి ఇన్విటేషన్ క్రీడా పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు.
- **బుట్టాయగూడెం :** ఐటీడీఏ ఎదురుగా గిరిజన షాపింగ్ కాంప్లెక్స్‌లో 3 షాపులు గిరిజన యువతకు అద్దె ప్రాతిపదికన కేటాయించనున్నారు. వ్యాపార వివరాలను తెలుపుతూ ఐటిడిఎ కార్యాలయంలో దరఖాస్తు చేసి మేనేజర్(7993955885) వారిని సంప్రదించాలని తెలిపారు.



ఏలూరులోని కళాశాలలో విద్యార్థినుల సందడి



ఏలూరు ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థినుల సందడి

సంక్రాంతి సందడి

ఏలూరు ఎడ్యుకేషన్: నగరంలోని పలు విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ముగ్గుల పోటీలు, మెహెందీ, రంగోలి, గాలిపటాలు, సంప్రదాయ వస్త్రధారణ, భోగిమంటలు, హరిదాసుల సంకీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు, పిండివంటల ప్రదర్శన, బొమ్మలకొలువు, కోలాటంతో సందడి నెలకొంది. సీఆర్‌ఆర్ అటానమస్ కళాశాలలో విద్యార్థులు జానపద, శాస్త్రీయ నృత్యాలతో అలరించారు. ఎన్నారై జూనియర్ కళాశాలలో విద్యార్థులు సందడి చేశారు. డీఈవో కార్యాలయ ప్రాంగణంలో సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు ఆఫీసు, మహిళా ఉద్యోగులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు.

- ఏలూరు క్రైం: పత్తేబాద నర్సింగ్ కళాశాల విద్యార్థినులు సంక్రాంతి ముగ్గులు, భోగి మంటలతో సందడి చేశారు. పల్లెటూరి జానపద నృత్యాలు, సాంస్కృతిక నృత్యాలు నిర్వహించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు.
- ఉంగుటూరు: చేబ్రోలులో ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. భోగి పళ్లు, రంగవల్లులు పగటి వేషాలు, హరిదాసులు, గంగిరెద్దులు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపీటీసీలు రాయి లక్ష్మి, మనసాల నాగమణి, స్థానికులు పాల్గొన్నారు.
- పోలవరం: గూటాల, ప్రగడపల్లి గ్రామాల్లో వలంటీర్లకు కోడి పందేల నిరోధించడంపై తహసీల్దారు బి.సుమతి అవగాహన కల్పించారు. మహిళా సిబ్బందికి ముగ్గుల పోటీలు నిర్వహించారు.



పోలవరం మండలం గూటాలలో ముగ్గుల పోటీ



చేబ్రోలులో చిన్నారులకు భోగిపళ్లు

బరులు సిద్ధం.. పోలీసు ఆదేశాలు బేఖాతర్

సంక్రాంతి సాంప్రదాయ ముసుగులో కోడిపందేలు.. జూదం



ఆగిరిపల్లి మండలం తోటపల్లిలో సిద్ధమౌతున్న బరి, (ఇన్‌సెట్‌) చాట్రాయిలో తలపడుతున్న పుంజులు

ఆగిరిపల్లి, జనవరి 11: జూదాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామంటూ పోలీసులు ఇచ్చిన ఆదేశాలు మండలంలో ఏమాత్రం అమలు కావడం లేదు. ఆదేశాలను బేఖాతరు చేస్తూ కోడిపందేల బరులు సిద్ధమవుతున్నాయి. పెద్దఎత్తున కోడిపందేలు నిర్వహించే శోభనాపురంలో ఈసారి నిర్వహించటం లేదు. దీంతో ఆపాత్ర తోటపల్లి రాజకీయ నాయకులు భుజాన వేసుకున్నారు. సుమారు పది ఎకరాల్లో కోడిపందేలు నిర్వహించుకునేందుకు అనుమతులు ఇచ్చినట్లు సమాచారం. అమ్మవారిగూడెం, చిన్నాగిరిపల్లి, ఈదరలో కోడిపందేలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పోలీసులు ఎంత హెచ్చరికలు చేసినా సంక్రాంతి మూడురోజులు అనుమతి ఇస్తారనే నమ్మకంతో బరులు సిద్ధం చేసుకునేందుకు నేతలు సిద్ధమయ్యారు.

● చాట్రాయి: మండలంలో జనార్దనవరం, చిన్నంపేట గ్రామాలలో సంక్రాంతి మూడు రోజులు కోడి పందేలు నిర్వహించటానికి అధికార పార్టీ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. జూద క్రీడలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నూజివీడు డీయస్పీ అశోక్‌కుమార్‌ గౌడ్‌ హెచ్చరించినా, కోడి పందేలు యథావిధిగా జరగనున్నాయి. ఎన్ని ఆంక్షలు విధించినా సంప్రదాయం పేరుతో కోడి పందేలు జరగటం షరా మామూలుగా మారింది. అనుబంధంగా కోసుఆట, ఇతర జూదక్రీడలు, మద్యం అమ్మకాలకు ఒప్పందాలు చేసుకుంటున్నారు.

● ముసునూరు: సాంప్రదాయ ముసుగులో కోడిపందెలు వేసేందుకు అధికారపార్టీకి చెందిన నిర్వాహకులు బరులు సిద్ధం చేశారు. లోపూడి, గోపవరం గ్రామాల్లో స్తంభాలు పాతి, చుట్టూ ఫెన్సింగ్‌ వేసి బరులను ఏర్పాటు చేశారు. కాట్రేనిపాడు, చెక్కపల్లి, గుడిపాడు, చిల్లబోయినపల్లి, వేల్పుచర్ల, చింతలవల్లి గ్రామాల్లో చిన్న బరులను తాయారు చేస్తున్నారు. సంప్రదాయం ముసుగులో పందేలు జోరుగా జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. పోలీసులు ఏటాలాగే కోడిపందే లపై చేతులుఎత్తేస్తారా లేదా నియంత్రిస్తారా వేచి చూడాలి.



బరి చుట్టూ ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌



మాట్లాడుతున్న ఎస్‌ఐ రామచంద్రరావు

జూదాలు చట్టరీత్యా నేరం

మండవల్లి, జనవరి 11: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఇంగిలిపాకలంకలో గురువారం పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్‌ రాజ్‌కుమార్‌, ఎస్‌ఐ రామచంద్రరావు మాట్లాడుతూ, నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పేకాట, కోడిపందేలు, గుండాట, ఇతర జూదాలు ఆడడం చట్టరీత్యా నేరమని అన్నారు. గ్రామప్రముఖులు పాల్గొన్నారు.

● చాట్రాయి: కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ కేసీహెచ్‌ స్వామి హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ, 130 మందిని బైండవర్‌ చేశామని చెప్పారు, యువకులు జూదాల వైపు వెళ్లకుండా క్రీడల కార్యక్రమం చేపట్టామని చెప్పారు. తెలంగాణ సరిహద్దు కృష్ణారావుపాలెంలో ఎన్నికల చెక్‌పోస్టు ఏర్పాటు చేశామని, కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామని ఎస్సై చెప్పారు.



గ్రామసభలో మాట్లాడుతున్న భాస్కరరావు

జలజీవన్‌ పనులు ఎక్కడ?

గ్రామసభలో సర్పంచ్‌, అధికారులపై గ్రామస్థుల ఆగ్రహం

మండవల్లి, జనవరి 11: జలజీవన్‌ పనులు ప్రారంభం కాకపోవడానికి సర్పంచ్‌, అధికారులు నిర్లక్ష్యమేనని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నాగేంద్రస్వామి ఆలయ ఆవరణలో గురువారం గ్రామసభ జరిగింది. జలజీవన్‌ పనులపై మూకుమ్మడిగా ప్రశ్నించడంతో సభ రసాభాసగా మారింది. సర్పంచ్‌ మెండా ఝాన్సీ అధ్యక్షతన నిర్వహించిన సభలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఎల్‌ఎస్‌ భాస్కరరావు, పి.అప్పారావు మాట్లాడుతూ, మండలంలో పలు గ్రామాల్లో జలజీవన్‌ పనులు పూర్తిచేస్తుండగా మండవల్లిలోనే ఎందుకు ప్రారంభం కాలేదని ప్రశ్నించారు. కాంట్రాక్టర్‌ రామారావు అధికారులు చుట్టూ తిరిగినా ఎన్ని కుళాయిలు ఏర్పాటు చేయాలో సమాచారాన్ని ఇవ్వకపోవడంతోనే పనులు ప్రారంభించలేకపోయామని తనకు వివరణ ఇచ్చారని భాస్కరరావు తెలిపారు. ఈ విషయమై ఏఎంసీ చైర్మన్‌ వీర్రాజు కార్యదర్శి టి.శ్రీనివాసరావును నిలదీశారు. ప్రజలకు ఎంతో ఉపయోగపడే ఈ పథకం అమలుపై నిర్లక్ష్యం తగదన్నారు. గ్రామసభల్లో తీర్మానించిన పనులు చేయనప్పుడు గ్రామసభలు ఎందుకని బండి రంగారావు ప్రశ్నించారు. సభకు వచ్చిన వారంతా సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు మాత్రమేనని, వార్డు మెంబర్లు 12మందికి ఒకరు మాత్రమే హాజరయ్యారు. స్టేషన్‌ రోడ్డులో అక్రమంగా (పంచాయతీ అనుమతి లేకుండా) రాత్రికి రాత్రి రెండు కుళాయి కనెక్షన్లు వేస్తే మీరు ఎందుకు చర్యలు తీసుకోలేదని కార్యదర్శిని ప్రశ్నించారు. ఆసుపత్రిని 24గంటలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, ఎన్‌హెచ్‌ పనులు త్వరితగతిన పూర్తి చేసే విధంగా ఉన్నత అధికారులు మాట్లాడాలి, ఎస్సీ శ్మశానవాటిక, ఎస్సీబీసీకాలనీల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ఐక్యవేదిక సభ్యులు అర్జీ అందజేశారు. సొసైటీ అధ్యక్షుడు బొమ్మనబోయిన గోకర్ణ యాదవ్‌, ఉపసర్పంచ్‌ విజయలక్ష్మి, సురేష్‌ తదితరులు పాల్గొన్నారు.

రాబోయేది టీడీపీ-జనసేన ప్రభుత్వమే



మాట్లాడుతున్న ముద్దరబోయిన

నూజివీడు, జనవరి 11: రాష్ట్ర ప్రజలను వైసీపీ ప్రభుత్వం ఏవిధంగా దగా చేసిందో వివరిస్తూ చంద్రబాబు చేపట్టిన 'రా కదిలి రా' ప్రచార కార్యక్రమా నికి ప్రజల్లో విశేష స్పందన వ్యక్తమవుతోందని టీడీపీ నూజివీడు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌, మాజీ శాసనసభ్యులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ఐదేళ్లగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక యువత నిరుద్యోగులుగా మారారన్నారు. ప్రతి సంవత్సరం జాబ్‌ క్యాలెండర్‌ ఇస్తానన్న జగన్‌ యువతను వంచించారన్నారు. మల్లవల్లి ఇండస్ట్రియల్‌ కారిడార్‌ను నిర్వీర్యం చేసిందన్నారు. అవినీతి, అన్యాయాలపై ప్రజలు తిరగబడే రోజు దగ్గరలోనే ఉందన్నారు. ఎన్నికల్లో జిల్లాలో అన్ని స్థానాల్లో టీడీపీ జెండా ఎగురవేయటం ఖాయమని, వచ్చేది టీడీపీ -జనసేన ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. మరిడి చిట్టిబాబు, చీకటి చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం



కరపత్రాలు అందజేస్తున్న నేతలు

కైకలూరు, జనవరి 11: వైసీపీపాలనలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని మాజీ జెడ్పీటీసీ బొమ్మనబోయిన విజయలక్ష్మి విమర్శించారు. కైకలూరు శివారు దానగూడెంలో గురువారం బాబు ష్యూరిటీ-భవిష్యత్‌ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు అందజేశారు. వినోద్‌, మాల్యాద్రి, ఎండీ జానీ, గంగుల శ్రీదేవి, ఓగిరాల శ్రీకాంత్‌ పాల్గొన్నారు.

'జగన్‌ మోసపూరిత మాటలు నమ్మొద్దు'



మాట్లాడుతున్న పెన్మెత్స

మండవల్లి, జనవరి 11: జగన్‌ మోసపూరిత మాటలు చెప్పి అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని చిన్నాభిన్నం చేశారని టీడీపీ నేత పెన్మెత్స వెంకటేశ్వరరాజు అన్నారు. పులపర్రులో గురువారం మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొత్త నాగేంద్రకుమార్‌ ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. వెంకటేశ్వరరాజు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో టీడీపీని గెలిపించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు చంద్రబాబును సీఎంను చేయాలని కోరారు. నారగాని వీరవెంకట నాగేశ్వరరావు, పెన్మెత్స త్రినాధరాజు, బలే ఏసురాజు, ముళ్ళపూడి సత్తిబాబు, కూనపురెడ్డి కోటేశ్వరరావు, తలారీ రాజేష్‌, తదితరులు పాల్గొన్నారు.



తుమ్మలను అభినందిస్తున్న టీడీపీ నాయకులు

తెలంగాణ మంత్రి తుమ్మలను కలిసిన టీడీపీ నేతలు

చాట్రాయి, జనవరి 11: తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆయన స్వగ్రామం గండుగులపల్లిలో గురువారం టీడీపీ మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి పదవి చేపట్టినందుకు శుభాకాంక్షలు తెలిపారు. పక్కనే ఉన్న సత్తుపల్లి నియోజవర్గానికి సుదీర్ఘకాలం ప్రాతినిధ్యం వహించిన తుమ్మల, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ ప్రభుత్వంలో భారీ నీటిపారుదల, ఆర్‌అండ్‌బీ శాఖల మంత్రిగా పనిచేసిన సమయంలో వెనుకబడిన చాట్రాయి మండలంలో సాగునీరు, రహదారుల అభివృద్ధికి భారీగా నిధులు మంజూరు చేయించారు. అన్ని గ్రామాల నాయకులతో తుమ్మలకు మంచి పరిచయాలు ఉన్నాయి.మందపాటి బసవారెడ్డి, బొట్టు రామచంద్రరావు, కందుల కృష్ణ, బొంతు సత్యనారాయణ, కంచర్ల హనుమంతరావు, బొర్రా నాగేశ్వరరావు తదితరులు తుమ్మలను కలిసినవారిలో ఉన్నారు.

నూజివీడుకు రైల్వేలైన్‌ సాధనకు త్వరలో రౌండ్‌టేబుల్‌

నూజివీడు టౌన్‌, జనవరి 11: నూజివీడుకు రైల్వేలైన్‌ సాధన కోసం త్వరలో రౌండ్‌టేబుల్‌ సమావేశం నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు చలసాని వెంకటరామారావు తెలిపారు. 350 సంవత్సరాల చరిత్రకలిగిన చారిత్రక పట్టణం నూజివీడుకు అటు సత్తుపల్లి నుంచి విజయవాడ రైల్వేలైన్‌ను కలిపేలా నూతన లైన్‌ ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపీ రాజ్యసభ సభ్యులు జి.వి.ఎల్‌ నరసింహారావుకు అఖిలపక్ష ఐక్యవేదిక మెమోరాండం ఇవ్వడం జరిగిందన్నారు. రైల్వేమంత్రి అశ్వినివైష్ణవకు రైల్వే లైన్‌ ఆవశ్యకతను వివరించి సర్వే చేయాలని, ఐక్యవేదిక నేతలు గోగినేని శ్రీనివాసకుమార్‌ అప్పారావు, సామాజిక కార్యకర్తలు చాట్రాతి రామకృష్ణ, జి.హనుమంతురావు, లోకాల ఉమామహేశ్వరరావులతో కలిసి కోరినట్లు పేర్కొన్నారు. ఈ లైన్‌ ఏర్పడితే నూజివీడు నుంచి మామిడి ఎగుమతులు ఢిల్లీ, అహ్మదాబాద్‌ వంటి పట్టణాలకు చేరవేయవచ్చన్నారు. సూరేపల్లి, సోమవరం ప్రాంతాల్లో బొగ్గు గనుల తవ్వకానికి అవకాశం ఉంటుందన్నారు.



ముదినేపల్లి, నూజివీడు, కలిదిండిలో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

షోకాజ్‌ నోటీసులకు భయపడం

31వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె

కలిదిండి, జనవరి 11 : తమ డిమాండ్లను పరిష్కరించాలంటూ గురువారం అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. తమకు షోకాజ్‌ నోటీసులు ఇచ్చినా భయపడమని సంఘ నేతలు అన్నారు. సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం చేస్తామన్నారు. అబిదా బేగం, రమాదేవి, మేనకా దేవి, నిర్మల, నాగలక్ష్మి, విజయకుమారి, సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

● నూజివీడు టౌన్‌: అంగన్‌వాడీల నిరసనదీక్ష 31వ రోజుకు చేరుకుంది. డిమాండ్ల సాధనకోసం నిరవధిక సమ్మెకు దిగిన అంగన్‌వాడీలు సబ్‌కలెక్టర్‌ కార్యాలయం వద్ద నిరసనదీక్ష నిర్వహిస్తున్నారు.సీఐటీయూ అధ్యక్షులు ఎన్‌.ఆర్‌. హనుమాన్లు మాట్లాడుతూ, ఎస్మా చట్టాన్ని ప్రయోగించటం దారుణమన్నారు.

● చాట్రాయి: ఉద్యోగాల నుంచి ఎందుకు తొలగించకూడదో 10 రోజుల్లో సమాధానం ఇవ్వాలని అధికారులు తమ ఇంటి గోడలకు నోటీసులు అంటించినంత మాత్రాన భయపడి సమ్మె విరమించటం జరగదని అంగన్వాడీలు స్పష్టంచేశారు. తహసీల్దార్‌ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో దీక్షలు కొనసాగాయి. విజయ, ప్రమీల, నిర్మలజ్యోతి పాల్గొన్నారు.

● ముసునూరు: అంగన్‌వాడీలు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మొద్దునిద్రవీడి ఇచ్చిన హామీలను నేరవేర్చాలని, లేకుంటే భవిష్యత్‌లో తగిన బుద్ధి చెబుతామని వర్కర్స్‌ యూనియన్‌ నియోజకవర్గ కార్యాదర్శి పి.రాజకుమారి హెచ్చరించారు. కె.విద్యావతి, మేరిసులోచన, శ్యామల, దుర్గ, జామయమ్మ, కృపమ్మ తదితరులు పాల్గొన్నారు.

● ఆగిరిపల్లి : అంగన్‌వాడీలకు సీపీఎం సంపూర్ణ మద్దతు తెలిపింది. సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగే ధర్నాకు సీపీఎం జిల్లాకమిటీ సభ్యుడు గరిసేపల్లి రాజు సంపూర్ణ మద్దతు తెలియజేశారు. సత్తుకోటేశ్వరరావు పాల్గొన్నారు.

● ముదినేపల్లి: సమస్యలు పరిష్కరించాలంటూ అంగన్‌వాడీలు ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. స్థానిక మండల కార్యాలయాల కాంప్లెక్స్‌ వద్ద ఏర్పాటు చేసిన నిరసన దీక్షా శిబిరంలో తమను విధుల్లో చేరాలంటూ నోటీసులు జారీ చేసిన ప్రభుత్వ వైఖరి నశించాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. బీజేపీ నేత లావేటి వీర శివాజీ మద్దతు తెలిపారు. యూటీఎఫ్‌ రాష్ట్ర కౌన్సిల్‌ సభ్యుడు జి.రమేష్‌ సంఘీభావం ప్రకటించారు.

తక్షణం విధుల్లో చేరండి..

ముదినేపల్లి: అంగన్‌వాడీ ఉద్యోగులకు ఐసీడీఎస్‌ అధికారులు గురువారం నోటీసులు జారీ చేశారు. 90 అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, 70 మంది సహాయకులకు ప్రాజెక్టు అధికారి ఆనంద్‌ బాబు రిజిస్టర్‌ పోస్టు ద్వారా నోటీసులు జారీ చేస్తూ గత నెల 12 నుంచి ఇప్పటి వరకు విధులకు హాజరు కాకపోవటంపై పది రోజుల్లోగా సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. గడువులోగా వివరణ ఇవ్వకపోతే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

● కైకలూరు: తక్షణమే విధుల్లో చేరాలని ఐసీడీఎస్‌ అధికారులు అంగన్‌వాడీలకు నోటీసులు జారీ చేశారు. తహసీల్దార్‌ కార్యాలయ శిబిరం వద్ద వీఆర్వోలు, ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్లు నోటీసులు అందజేసేందుకు ప్రయత్నించగా తీసుకునేది లేదని ఖరాఖండిగా తిప్పికొట్టారు. అంగన్వాడీ స్కూళ్లు వారి ఇళ్ల వద్ద నోటీసులు అంటించారు. 31 అంకె ఆకారంలో నిరసన తెలిపారు. పీ సుజాత, ఎల్‌. మీనాకుమారి, రమణ, ఉషా, విజిత, ఝాన్సీ పాల్గొన్నారు.



కైకలూరులో 31 అంకె ఆకారంలో అంగన్‌వాడీల నిరసన

29 మంది విధుల్లో చేరిక

నూజివీడు టౌన్‌, జనవరి 11: మహిళా శిశుసంక్షేమశాఖ నూజివీడు ప్రాజెక్ట్‌ పరిధిలో మొత్తం 16 మంది కార్యకర్తలు విధుల్లో చేరినట్లు నూజివీడు సీడీపీవో షేక్‌ నూరానీ తెలిపారు. ప్రాజెక్టు పరిధిలోని 319 అంగన్‌వాడీ సెంటర్ల పరిధిలో అంగన్‌వాడీలు నిరవధిక సమ్మెకు వెళ్లగా, చిన్నారులు, గర్భిణీలకు పౌష్టికాహారం అందించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయటం జరిగిందన్నారు. విధుల్లో చేరాలని ప్రభుత్వం నోటీసులు జారీ అయిన నేపథ్యంలో 16 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, 13మంది సహాయకులు మొత్తం 29 మంది విధుల్లో చేరినట్లు ఆమె తెలిపారు.

కత్తుల దాడిపై విచారణ చేపట్టాలి

జనసేన నేత శివరామకృష్ణ



మాట్లాడుతున్న మరీదు

నూజివీడు టౌన్‌, జనవరి 11: స్థానిక ఎమ్మెల్యే ఇంట్లో కత్తులతో పొడుచుకున్న ఘటనపై జిల్లా ఎస్పీ నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని ఉమ్మడి కృష్ణాజిల్లా జనసేన అధికార ప్రతినిధి, నియోజకవర్గ నేత మరీదు శివరామ కృష్ణ కోరారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, గత ఆదివారం ఎమ్మెల్యే ప్రతాప్‌ కార్యాలయంలో కుమారుడు వేణుగోపాల అప్పారావు సమక్షంలోనే వైసీపీలో ఇరువర్గాలు దాడులు చేసుకో వడం జరిగిందన్నారు. అలాంటి వారిపై కేసులు నమోదు చేయకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. వైసీపీ కడప సంస్కృతిని నూజివీడుకు దిగుమతి చేయాలని చూస్తోందన్నారు. టీటీడీ స్థలాన్ని రాజకీయ కార్యకలాపాలకు నిలయంగా మార్చారని విమర్శించారు. దీనిపై టీటీడీ అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారో తెలియటం లేదన్నారు. కత్తులతో దాడికి దిగిన వ్యక్తులను తక్షణం అరెస్ట్‌చేయాలని డిమాండ్‌ చేశారు.

విజిలెన్స్‌ తనిఖీలు.. రూ 7.70 లక్షల జరిమానా



మాట్లాడుతున్న విద్యుత్‌ అధికారులు

చాట్రాయి, జనవరి 11:మండలంలో గురువారం విద్యుత్‌ విజిలెన్స్‌ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అదనపులోడు వినియోగిస్తున్న వారికి రూ.7.70 లక్షలు జరిమానా విధించారు. విజిలెన్స్‌ ఈఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, 44 బృందాలు 2,648 గృహ సర్వీసులను, 314 వాణిజ్య సముదాయలను తనిఖీ చేసి అదనపు లోడు వినియోగిస్తున్న వారికి జరిమానా విధించామన్నారు. వేరే కేటగిరిలో వాడుతున్న ముగ్గురికి రూ.40 వేలు, విద్యుత్‌ చౌర్యం చేస్తున్న ఎనిమిది మందికి రూ.75 వేలు జరిమానా విధించామన్నారు. ఆపరేషన్‌ ఈఈ సత్యనారాయణ, గంగాభవానీ, సంజీవయ్య నూజివీడు డివిజన్‌ పరిధిలోని ఏఈలు, జేఈలు, ఎల్‌ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

15 మందికి కంటి ఆపరేషన్‌లు

ముసునూరు, జనవరి 11: మండలంలోని రణక్కపేటకు చెందిన 15 మందికి అట్లూరి ఛారిటిబుల్‌ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో నూజివీడు అమెరికన్‌ ఆసుపత్రిలో ఉచితంగా కంటి అపరేషన్‌లు చేయించారు. ట్రస్ట్‌ చెర్మన్‌ అట్లూరి వెంకట రవీంద్ర గురువారం రోగులకు కళ్లజోళ్లు, మందులను అందజేశారు. కంటివైద్య నిపుణులు డాక్టర్‌ జెమ్మిద్‌ షాహీన్‌, రంగు వాసు, మల్లేశ్వరావు, కె.శివాజీ, నాగరాజు, కాంతరావు, శివ తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్‌ పోటీల్లో గెలిచిన అన్నవరం జట్టు

క్రికెట్‌, వాలీబాల్‌ పోటీలు

నూజివీడు టౌన్‌, జనవరి 11: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో భాగంగా మండల స్థాయిలో క్రికెట్‌, వాలీబాల్‌ పోటీలను గురువారం నిర్వహించారు. క్రికెట్‌లో సెహ్రాపేట-పాతపేట మధ్య పోటీసాగగా, సెహ్రాపేటపై పాతపేట విజయం సాధించింది. వాలీబాల్లో పాతరావిచర్ల- అన్నవరం గ్రామాల మధ్య పోటీజరగ్గా, అన్నవరం విజయం సాధించింది.

● చాట్రాయి: స్థానిక జడ్పీ హైస్కూల్‌ ఆవరణలో గురువారం ఆడుదాం ఆంధ్ర రెండో రోజు ఆటల పోటీలు జరిగాయి. వివిధ గ్రామాలకు చెందిన క్రికెట్‌ జట్లు పోటీలలో పాల్గొన్నాయి. పీఈటీలు సతీష్‌కుమార్‌, ప్రభాకరరావు, విజయ్‌, వెంకట్‌ పర్యవేక్షించారు.

'ఆడుదాం ఆంధ్ర' పోటీల్లో క్రీడాకారుల మధ్య ఘర్షణ

ముసునూరు, జనవరి 11: స్థానిక జడ్పీపాఠశాలలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్ర మండలస్థాయి ఆటలపోటీల్లో గురువారం క్రీడాకారుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. రమణక్కపేట పీడీ వాక నాగరాజు ఎంపైర్‌గా కాట్రేనిపాడు, గుళ్ళపూడి జట్లు మధ్య కబడ్డీ పోటీని నిర్వహించారు. గుళ్ళపూడి జట్టు ఆటగాడు రైడ్‌కి వెళ్లగా, కాట్రేనిపాడు ఆటగాళ్లు టాకిల్‌ చేయగా రైడర్‌ మిడ్‌లైన్‌ టచ్‌ చేశాడు. అయితే ఎంపైర్‌గా ఉన్న నాగరాజు గుళ్ళపూడి జట్టుకు పాయింట్‌ ఇచ్చాడు. దీంతో కాట్రేనిపాడు జట్టు కెప్టెన్‌ పీడీ నాగరాజుపై దుర్భాషలాడుతున్న క్రమంలో గుళ్ళపూడి జట్టు ఆటగాళ్లు కలుగచేసుకోవడంతో ఇరుజట్ల మధ్య కొద్దిసేపు ఘర్షణ జరిగింది. దీంతో ఎంపీడీవో రాణి రంగంలోకి దిగి, కాట్రేనిపాడు జట్టు ఆటగాళ్ల తీరుపె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపైర్‌ నిర్ణయానికి ఆటగాళ్లు కట్టుబడి ఉండాలని, ఎవరైన ఇష్టానుసారంగా మాట్లాడితే సహించేదిలేదని హెచ్చరించారు. క్రీడస్ఫూర్తి కలిగి ఉండాలని, గొడవలకు దిగవద్దని చెప్పడంతో ఘర్షణ సద్దుమణిగింది. అనంతరం యథావిధిగా ఆటను కొనసాగించారు.

తెగుళ్ల నివారణపై అవగాహన



మాట్లాడుతున్న శాస్త్రవేత్త

నూజివీడు టౌన్‌, జనవరి 11: మామిడి తోటల్లో తెగుళ్ల నివారణపై శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. తేనెమంగు నివారణకు వేపనూనె మూడు మిల్లీలీటర్లు లేదా ఇమిడాక్లోపిడ్‌ 0.3 మిల్లీలీటర్లను లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని నూజివీడు మామిడిపరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్‌ బి.కనకమహాలక్ష్మి సూచించారు. బోర్వంచ, ఆగిరిపల్లి గ్రామాల్లో మామిడి తోటలను ఉద్యానశాఖ ఆధ్వర్యంలో మామిడిపరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు గురువారం సందర్శించారు. తోటల్లో తేనెమంగు పురుగు, తామర పురుగుల ఉధృతి కనిపిస్తోందని, నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. తామరపురుగు అరికట్టేందుకు థయోమిథాక్సామ్‌ 0.5 గ్రాములు లేదా ఫిప్రోనిల్‌ రెండు మిల్లీలీటర్లు లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. పండుఈగ నివారణకు ఎర్రబుట్టలను తోటల్లో ఏర్పాటు చేసుకోవాలన్నారు.కె.రాధారాణి, జె.శాంతి, ఉద్యానశాఖ అధికారిణి ఆర్‌.హేమ, జయలక్ష్మి, ప్రవీణ్‌ పాల్గొన్నారు.

నూజివీడులో ఫైలేరియా సర్వే

నూజివీడు టౌన్‌, జనవరి 11: పట్టణ పరిధిలో ఫైలేరియా సర్వేను గురువారం చేపట్టారు.16 గ్రామ సచివాలయాల పరిధిలో సబ్‌యూనిట్‌ ఆఫీసర్‌ యలమంద నేతృత్వంలో హెచ్‌వీలు, ఏఎన్‌ఎమ్‌లు సర్వే నిర్వహించారు. ప్రతి సచివాలయంలోనూ 20మంది రక్తనమూనాలను సేకరించి పరీక్షలకు పంపటం జరుగుతోందని సబ్‌యూనిట్‌ ఆఫీసర్‌ యలమంద తెలిపారు. ఫైలేరియా (బోదకాలు)కు కారణమయ్యే పరాన్నజీవి రక్తంలో అంతర్గతంగా చాలాకాలం ఉన్న తరువాత మాత్రమే బయటపడు తుందని, ముందస్తుగా గుర్తించి తగు వైద్యసేవలు అందిస్తే ఫైలేరియా వల్ల దుష్ప్రభావాలు తగ్గే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

ఉజ్వల గ్యాస్‌ కనెక్షన్ల పంపిణీ

కైకలూరు, జనవరి 11: ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం ద్వారా ఉచిత గ్యాస్‌ కనెక్షన్లు ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, బీజేపీ కైకలూరు అసెంబ్లీ కన్వీనర్‌ వేంపాటి విష్ణురావు పంపిణీ చేశారు. ఆలపాడులో హెచ్‌పీ గ్యాస్‌ ఏజెన్సీ ద్వారా ఉచిత గ్యాస్‌ కనెక్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు.



ముదినేపల్లి రామాలయంలో కూడారై ఉత్సవం

వైభవంగా కూడారై ఉత్సవం

ముదినేపల్లి, జనవరి 11: ధనుర్మాసం సందర్భంగా గురువారం సీతారామ చంద్రస్వామి (పెదరామాలయం) దేవస్థానంలో గోదాదేవికి కూడారై మహోత్సవం వైభవంగా జరిగింది. కమిటీ సభ్యులు పొట్లూరి గాంధీ, అడుసుమిల్లి రాజేంద్ర ప్రసాద్‌ పర్యవేక్షణలో అర్చకుడు బృందావనం ప్రసాద్‌ పర్యవేక్షణలో అర్చకుడు బృందావనం శ్రీనివాసాచార్యులు రంగనాయక స్వామి, గోదాదేవికి విశేష పూజలు నిర్వహించారు. దీపారాధనలతో గోదాదేవికి కూడారై ఉత్సవం నిర్వహించారు.

● ముసునూరు: స్థానిక వెంకటాచలస్వామి ఆలయంలో 28వరోజు గురువారం కూడారై ఉత్సవాన్ని వైభవంగా చేశారు. ప్రధాన అర్చకులు వేదాంతం లక్ష్మీనరసింహచార్యులు.. రంగనాధ సహిత గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుప్పావై, శ్రీకృష్ణ గోదాదేవి సహస్రనామ పారాయణాన్ని మహిళలు భక్తిశ్రద్ధతలతో ఆలపించారు. సుగంధద్రవ్యాలతో తయారుచేసిన పాయసాన్ని 108 ఇత్తడి గిన్నిల్లో పోసి, స్వామివారికి నివేదిన చేశారు. ఆలయ ఛైర్మెన్‌ దేవినేని వరప్రసాదరావు, రేగుల చంద్రశేఖర్‌రావు దంపతులు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

రేపు గరికపాటి ధ్యానమందిర వార్షికోత్సవం

ఆగిరిపల్లి, జనవరి 11: గరికపాటి పిరమిడ్‌ ధ్యానమందిరం 10వ వార్షికోత్సవం బ్రాహ్మణవీధిలో ఈ నెల 13న జరగనుంది. ధ్యానం అంటే శ్వాసమీద ధ్యాస అనే భావనతో అందరికి ఆరోగ్యం అందించే ఉద్దేశంతో గరికపాటి పిరమిడ్‌ ఆగిరిపల్లిలో పదేళ్ల క్రితం ఏర్పడింది. ధ్యానం.. మానసిక ప్రశాంతత, బుద్ధికుశలత, ఆత్మవిశ్వాసానికి దోహద పడుతుందని పర్యవేక్షకులు తెలిపారు.

చిన్నంపేట శ్మశానవాటికకు నీటివసతి

చాట్రాయి, జనవరి 11: మండలంలోని చిన్నంపేట శ్మశానవాటికలో మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య తన సొంత నిధులతో నిర్మించిన చేతిపంపును గురువారం మాజీ సర్పంచ్‌ నాగమల్లేశ్వరరావు, కొమ్ము సుజనరావు ప్రారంభించారు. శ్మశానవాటికలో నీటి వసతి లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా, నీటి సమస్య పరిష్కారం కావటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పెన్షన్‌కు అర్హత పొందిన దివ్యాంగురాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్‌



ముదినేపల్లి, జనవరి 11 : దివ్యాంగురాలు గోన మాధవి వికలాంగురాలి సర్టిఫికెట్‌ను పొందే విషయంలో ఓ మెట్టు ఎక్కింది. అర్హత ఉండి మెడికల్‌ సర్టిఫికెట్‌ పొందలేక గత ఎనిమిది సంవత్సరాలుగా ఆమె పడిన బాధలపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వరుస కథనాలపై స్పందించిన కలెక్టర్‌ ప్రసన్న వెంకటేష్‌ ఆమెకు పెన్షన్‌ మంజూరుకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో డీఎంహెచ్‌వో ముదినేపల్లి పీహెచ్‌సీ మెడికల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ శాంతిశ్రీకి ఈ బాధ్యత అప్పగించగా, ఆమె సదరన్‌ సర్టిఫికెట్‌ కోసం స్లాట్‌ బుక్‌ చేయించారు. గురువారం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి 108లో తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించి వికలాంగ సర్టిఫికెట్‌కు నమోదు చేయించారు. పది రోజుల్లో ఆ సర్టిఫికెట్‌ను ఆన్‌లైన్‌లో గ్రామ సచివాలయానికి పంపనున్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో శంకర్‌రావు

చాట్రాయి, జనవరి 11: మండలంలో చాట్రాయి, జనార్దనవరం గ్రామాల్లో గురువారం వికసిత్‌ భారత్‌ సంకల్ప యాత్ర నిర్వహించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో దుర్గాప్రసాద్‌, కార్యదర్శి నాగరాజు, ఓబిళ్ళనేని రాజా, ముత్తారెడ్డి, సంజీవరెడ్డి, శర్మ, చెన్నారావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● ఆగిరిపల్లి: వికసిత్‌ భారత్‌ సంకల్పయాత్ర ఈనెల 17న ప్రారంభం అవుతున్న సందర్భంగా గృహనిర్మాణ పురోగతికి సంబంధించిన సన్నాహక సమీక్ష గురువారం జరిగింది. మండల ఆరోగ్యఅధికారి, హౌసింగ్‌ ఏఈ, వ్యవసాయ, ఉద్యానవన అధికారి, ఈవోఆర్డీ, డబ్ల్యూఈఏ డిజిటల్‌ అసిస్టెంట్లు అధికారులు పాల్గొన్నారని ఎంపీడీవో శంకర్‌రావు తెలిపారు.

క్రైం కార్నర్‌

ఉరేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

కలిదిండి, జనవరి 11 : తాగిన మైకంలో ఓ వృద్ధుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలివి. మూల్లంక పంచాయతీ పరిధిలోని సత్యనారాయణ నగర్‌కు చెందిన సంగాని మోషే (65) బుధవారం రాత్రి తాగిన మైకంలో రామాలయం పక్కనే ఉన్న చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడు కొంతకాలంగా భార్యపిల్లలకు దూరంగా ఉంటూ ఒంటరిగా జీవిస్తున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి తమ్ముడు సంగాని శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ప్రియకుమార్‌ తెలిపారు.